# మహి న్యూస్

www.mahinewsindia.com

MAHI NEWS

Epaper: https://epaper.mahinewsindia.com

తెలుగు దినపత్రిక








ఆంధ్రప్రదేశ్,తెలంగాణ. సంపుటి : 02 సంచిక : 209 ఎడిటర్ : నీలి రామసుబ్బయ్య. పేజీలు : 8, వెల రూ. 2 గురువారం -29 - అక్టోబర్ - 2026

Published From :YSR Kadapa circulated by Kurnool I Anatapuram I Chittoor I East & West Godavari I Guntur I Krishna I Nellore I Srikakulam I Visakhapatnam I Vijayanagaram I Prakasham & Hyderabad & Telangana




2లో

### ఏపీని వణికిస్తున్న అర్నబ్ తుపాను.. వేర్వేరు ఘటనల్లో 7 మంది మృతి

- అర్నబ్ తుపాను కారణంగా ఏపీలో విషాద ఘటనలు
- రాష్ట్రవ్యాప్తంగా వేర్వేరు ఘటనల్లో ఏడుగురు మృతి
- కరెంట్ స్తంభాలు, చెట్లు కూలి పలువురి దుర్మరణం
- విశాఖ, పశ్చిమగోదావరి, కోనసీమ, అనకాపల్లి జిల్లాల్లో మరణాలు

# తుపాను ప్రభావం తగ్గే వరకు క్షేత్ర స్థాయి విధుల్లోనే ఉండాలి

## సహాయ చర్యలు వేగవంతం చేయాలని స్పష్టమైన ఆదేశాలు

- ★ అధికారులకు పవన్ ఆదేశం
- ★ అర్నబ్ తుపాను సహాయక చర్యలపై జిల్లాల కలెక్టర్లతో పవన్ కళ్యాణ్ సమీక్ష
- ★ విద్యుత్, రహదారులను వెంటనే పునరుద్ధరించాలని సూచన
- ★ కోనసీమ, కాకినాడ జిల్లాల్లోని నష్టంపై ప్రత్యేకంగా ఆరా తీసిన పవన్ కళ్యాణ్
- ★ గంటకు 140 కి.మీ. వేగంతో గాలులు.. పలు జిల్లాల్లో భారీగా ఆస్తి, పంట నష్టం





అమరావతి: అర్నబ్ తీవ్ర తుపాను తీరం దాటిన నేపథ్యంలో రాష్ట్ర యంత్రాంగం మొత్తం మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని, తుపాను ప్రభావం పూర్తిగా తగ్గేంత వరకు అధికారులు క్షేత్ర స్థాయిలోనే ఉండి సహాయక చర్యలను పర్యవేక్షించాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. బాపట్ల నుంచి శ్రీకాకుళం వరకు తుపాను ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో బుధవారం మధ్యాహ్నం ఆయన ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. పునరావాస కేంద్రాల్లో ఉన్న ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని, దెబ్బతిన్న మౌలిక సదుపాయాలను యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించాలని ఆదేశించారు. ముఖ్యంగా తుపాను తీరం దాటిన డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని అంతర్వేది పరిసరాలు, కాకినాడ జిల్లా తీర ప్రాంతాలపై పవన్ కళ్యాణ్ ప్రత్యేకంగా దృష్టి సారించారు. మిగతా 2 లో

### ఏపీలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు వాయిదా.. కొత్త తేదీలు ఇవే!




2లో

- ఆంధ్రప్రదేశ్‌లో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల షెడ్యూల్ సవరణ
- పోలింగ్, ఓట్ల లెక్కింపు తేదీలలో మార్పులు
- నవంబర్ 3కి బదులుగా 5వ తేదీన పోలింగ్
- నవంబర్ 5కి బదులుగా 7వ తేదీన ఓట్ల లెక్కింపు

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో జరగాల్సిన జిల్లా పరిషత్, మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ (జెడ్పీటీసీ, ఎంపీటీసీ)

### టాటా గ్రూప్‌ను నాశనం చేస్తున్నారు: మోదీ, అమిత్ షాలపై రాహుల్ గాంధీ ఫైర్



2లో

టాటా గ్రూప్‌ను నేరపూరితంగా నాశనం చేస్తున్నారన్న రాహుల్ గాంధీ

మోదీ, అమిత్ షాలపై తీవ్ర విమర్శలు

భయంతోనే వ్యాపారవేత్తలు మౌనంగా ఉన్నారని ఆరోపణ



2లో

### వెయ్యి కి.మీ. రేంజ్ మిస్సైళ్లు... శిక్షణ కోసం భారత్ వైపు జపాన్ చూపు

వెయ్యి కి.మీ. రేంజ్ మిస్సైళ్లు... శిక్షణ కోసం భారత్ వైపు జపాన్ చూపు

జపాన్ సైన్యానికి భారత్‌లో శిక్షణ ఇచ్చేందుకు యత్నాలు

ఉపరితలం నుంచి నౌకలను ఛేదించే క్షిపణులపై తర్ఫీదు



2లో

### కర్ణాటక ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు భారీ షాక్.. క్లీన్‌స్వీప్ చేసిన ఎన్డీయే

నాలుగు స్థానాలనూ కైవసం చేసుకున్న బీజేపీ-జేడీఎస్ కూటమి

బీజేపీకి మూడు, జేడీఎస్‌కు ఒక స్థానం..

బెంగళూరు టీచర్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ సిట్టింగ్ ఎమ్మెల్సీ ఓటమి

# సెక్రటేరియట్‌కు సీఎం చంద్రబాబు.. తుపాను పరిస్థితిపై సమీక్ష

- సెక్రటేరియట్‌కు చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు
- అర్నబ్ తుపాను పరిస్థితిపై ఆర్టీజీఎస్‌లో సమీక్ష
- కూలిన చెట్లను వెంటనే తొలగించాలని అధికారులకు ఆదేశం
- రవాణా వ్యవస్థను తక్షణం పునరుద్ధరించాలని సూచన
- మనమిత్ర యాప్ ద్వారా ఫిర్యాదుల త్వరితగతిన పరిష్కారం



అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు సచివాలయానికి చేరుకుని, 'అర్నబ్' తుపాన్ ప్రభావిత జిల్లాల్లోని పరిస్థితిపై ఉన్నతస్థాయి సమీక్ష చేపట్టారు. 'రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ' (ఆర్టీజీఎస్) కేంద్రం నుంచి సీసీ కెమెరాల ద్వారా మిగతా 2 లో

### తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన కరవు మండలాల జాబితాపై బండి సంజయ్ విమర్శలు

కరవు మండలాల జాబితా అశాస్త్రీయమన్న బండి సంజయ్

- కరీంనగర్ పార్లమెంట్ పరిధికి తీవ్ర అన్యాయం జరిగిందని ఆరోపణ
- 35 శాతం వర్షపాతం లోటు ఉన్న మండలాలను కూడా విస్మరించారని ఆగ్రహం



హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన కరవు మండలాల జాబితాపై కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఈ జాబితా అత్యంత మిగతా 2 లో




2లో

### తెలంగాణలో భారీగా ఐఏఎస్‌ల బదిలీలు.. కీలక శాఖలకు కొత్త అధికారులు

- కీలక శాఖలకు కొత్త అధికారులను నియమించిన ప్రభుత్వం
- పంచాయతీరాజ్ శాఖకు నవీన్ మిట్టల్
- జీహెచ్ఎంసీ బాధ్యతలు సర్ఫరాజ్ అహ్మద్‌కు

# తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి

## తాగునీటి సరఫరా విషయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- నీటి నాణ్యత విషయంలో ఏ మాత్రం రాజీ పడొద్దు
- రిజర్వాయర్లలో నీటి నిల్వలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలి
- క్యూర్ ప్రాంత పరిధిలోని మురుగునీటి శుద్ధి కేంద్రాలు (ఎస్టీపీలు) వంద శాతం సామర్థ్యంతో పని చేసేలా చూడాలి
- భవన నిర్మాణంలో శుద్ధి చేసిన నీటినే వాడాలనే నిబంధనను కచ్చితంగా అమలు చేయాలి
- ఎస్టీపీల నిర్వహణకు సోలార్ విద్యుత్‌ను వినియోగించే అవకాశాలను పరిశీలించాలి



హైదరాబాద్: రాజధాని హైదరాబాద్ నగరంలో ఎట్టి పరిస్థితుల్లోనూ తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. తాగునీటి సరఫరా విషయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రిజర్వాయర్లలో నీటి నిల్వలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలని చెప్పారు. క్యూర్ పరిధిలో మంచినీటి సరఫరా, మిగతా 2 లో



2లో

### రాష్ట్రంలో ఎమర్జెన్సీ పాలన నడుస్తోంది: కాంగ్రెస్ సర్కార్‌పై హరీశ్ రావు ధ్వజం

- మూసీ ప్రాజెక్టుపై ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లకుండా బీఆర్ఎస్ నేతలను దిగ్బంధించారన్న హరీశ్
- కరవుతో అల్లాడుతున్న రైతులను ఆదుకోవడం చేతకాని ప్రభుత్వమని విమర్శ
- ప్రతిపక్షాల గొంతును ఎంతకాలం అణచివేస్తారని ప్రశ్న

హైదరాబాద్: మూసీ నది ప్రాజెక్టుపై ప్రజాభిప్రాయ సేకరణకు హాజరుకాకుండా బీఆర్ఎస్ నేతలను గృహనిర్బంధం

## కేటీఆర్ పాస్‌పోర్ట్ వివాదం..
# యథాతథ స్థితి కొనసాగించాలన్న హైకోర్టు

హైదరాబాద్: ఫార్ములా ఈ-రేస్ నిధుల మళ్లింపు కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీ రామారావుకు తెలంగాణ హైకోర్టులో తాత్కాలిక ఊరట లభించింది. ఆయన పాస్‌పోర్ట్‌కు సంబంధించి జారీ అయిన నోటీసుల విషయంలో యథాతథ స్థితి (స్టేటస్ కో) కొనసాగించాలని న్యాయస్థానం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఫార్ములా ఈ కేసులో విచారణ జరుపుతున్న అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ), కేటీఆర్ పాస్‌పోర్ట్‌ను స్వాధీనం చేసుకోవాలని కోరుతూ ప్రాంతీయ పాస్‌పోర్ట్ కార్యాలయానికి (ఆర్‌పీవో) లేఖ రాసింది. ఏసీబీ అభ్యర్థన మేరకు పాస్‌పోర్ట్ అధికారులు కేటీఆర్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ నోటీసులను సవాలు చేస్తూ కేటీఆర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం, పాస్‌పోర్ట్ నోటీసుల ప్రక్రియలో యథాతథ స్థితిని పాటించాలని ఆదేశించింది. ప్రతివాదులుగా ఉన్న ఏసీబీ, పాస్‌పోర్ట్ అధికారులకు నోటీసులు జారీ చేస్తూ, వారి వాదనలను కౌంటర్ అఫిడవిట్ రూపంలో సమర్పించాలని సూచించింది. అనంతరం, కేసు తదుపరి విచారణను నవంబర్ 6వ తేదీకి వాయిదా వేసింది. హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులతో కేటీఆర్ పాస్‌పోర్ట్‌ను స్వాధీనం చేసుకునే ప్రక్రియకు ప్రస్తుతానికి అడ్డుకట్ట పడినట్లయింది.

## కర్ణాటక ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు భారీ షాక్..
# క్లీన్‌స్వీప్ చేసిన ఎన్డీయే

కర్ణాటక: కర్ణాటకలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి శాసనమండలి (ఎమ్మెల్సీ) ఎన్నికల్లో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. రాష్ట్రంలో నాలుగు స్థానాలకు జరిగిన ఎన్నికల్లో ప్రతిపక్ష బీజేపీ-జేడీఎస్ (ఎన్డీయే) కూటమి క్లీన్‌స్వీప్ చేసింది. ఈ ఫలితాల్లో బీజేపీ మూడు స్థానాల్లో విజయం సాధించగా, దాని మిత్రపక్షమైన జేడీఎస్ ఒక స్థానాన్ని కైవసం చేసుకుంది. అధికార కాంగ్రెస్ పార్టీ ఒక్క స్థానంలో కూడా గెలవలేకపోయింది. రాష్ట్రంలోని రెండు పట్టభద్రుల, రెండు ఉపాధ్యాయ నియోజకవర్గాలకు అక్టోబర్ 23న పోలింగ్ జరిగింది. అక్టోబర్ 27న వెలువడిన తుది ఫలితాల్లో ఎన్డీయే కూటమి మొత్తం నాలుగు స్థానాలనూ గెలుచుకున్నట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. ఈ నియోజకవర్గాల్లో 74 శాతం నుంచి 87 శాతం మధ్య మెరుగైన పోలింగ్ శాతం నమోదైంది. అందరి దృష్టిని ఆకర్షించిన బెంగళూరు టీచర్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ సిట్టింగ్ ఎమ్మెల్సీ పుట్టన్న ఓటమి పాలయ్యారు. బీజేపీ మద్దతుతో బరిలోకి దిగిన జేడీఎస్ అభ్యర్థి ఏపీ రంగనాథ్, పుట్టన్నపై 908 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. రంగనాథ్‌కు 10,810 ఓట్లు రాగా, పుట్టన్నకు 9,902 ఓట్లు పోలయ్యాయి. మిగిలిన మూడు స్థానాలను బీజేపీ అభ్యర్థులు గెలుచుకున్నారు. నార్త్-ఈస్ట్ టీచర్స్ స్థానం నుంచి సిట్టింగ్ ఎమ్మెల్సీ శశిల్ జి.నమోషి తన స్థానాన్ని నిలబెట్టుకున్నారు. సౌత్-ఈస్ట్ గ్రాడ్యుయేట్స్ నుంచి కేఎం సురేశ్, వెస్ట్ గ్రాడ్యుయేట్స్ స్థానం నుంచి ఎస్వీ సంకనూర్ విజయం సాధించారు. ఈ ఫలితాలు కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకతకు నిదర్శనమని ఎన్డీయే కూటమి నేతలు వ్యాఖ్యానిస్తున్నారు. అయితే, ఈ ఎన్నికల ఫలితాలు రాష్ట్ర అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వ మెజారిటీపై ఎలాంటి ప్రభావం చూపవని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## సెక్రటేరియట్‌కు సీఎం చంద్రబాబు..
# తుపాను పరిస్థితిపై సమీక్ష

అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు సచివాలయానికి చేరుకుని, 'అర్నబ్' తుపాన్ ప్రభావిత జిల్లాల్లోని పరిస్థితిపై ఉన్నతస్థాయి సమీక్ష చేపట్టారు. 'రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ' (ఆర్టీజీఎస్) కేంద్రం నుంచి సీసీ కెమెరాల ద్వారా క్షేత్రస్థాయి పరిస్థితులను ఆయన నేరుగా పరిశీలించారు. తుపాను గమనం, ప్రస్తుత పరిస్థితి, క్షేత్రస్థాయిలో తీసుకుంటున్న చర్యల గురించి ఆర్టీజీఎస్ అధికారులు ముఖ్యమంత్రికి సమగ్రంగా వివరించారు. తుపాను కారణంగా పలుచోట్ల చెట్లు కూలిపోయిన నేపథ్యంలో ఎక్కడైనా ట్రాఫిక్ సమస్యలు తలెత్తాయా అని సీఎం ఆరా తీశారు. జాతీయ రహదారులతో పాటు ఇతర మార్గాల్లో విరిగిపడిన చెట్లను తక్షణమే తొలగించి, రవాణా వ్యవస్థను పునరుద్ధరించాలని అధికారులను ఆదేశించారు. తుపాను హెచ్చరికలు వచ్చినప్పటి నుంచి ఆర్టీజీఎస్ ద్వారా నిరంతరం పరిస్థితిని పర్యవేక్షిస్తున్నట్లు ఐటీ శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్ ముఖ్యమంత్రికి తెలిపారు. అదేవిధంగా ప్రజల నుంచి 'మనమిత్ర' యాప్ ద్వారా వస్తున్న ఫిర్యాదులను సంబంధిత అధికారులకు చేరవేసి, సమస్యలను వెంటనే పరిష్కరిస్తున్నట్లు అధికారులు వివరించారు. ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తంగా ఉండి, సహాయక చర్యలను వేగవంతం చేయాలని సీఎం చంద్రబాబు సూచించారు.

## తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి

హైదరాబాద్: రాజధాని హైదరాబాద్ నగరంలో ఎట్టి పరిస్థితుల్లోనూ తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. తాగునీటి సరఫరా విషయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రిజర్వాయర్లలో నీటి నిల్వలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలని చెప్పారు. క్యూర్ పరిధిలో మంచినీటి సరఫరా, ఎస్టీపీల నిర్మాణం, ట్రీటెడ్ వాటర్ వినియోగంపై ఎంసీఆర్‌హెచ్ ఆర్డీ బోధి పెవిలియన్‌లో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఎల్‌నినో నేపథ్యంలో భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని క్యూర్ ప్రాంత పరిధిలోని మురుగునీటి శుద్ధి కేంద్రాలు (ఎస్టీపీలు) వంద శాతం సామర్థ్యంతో పని చేసేలా చూడాలని ఆదేశించారు. సెక్రటేరియట్‌తో పాటు సీఎంఓ, అవుటర్ రింగ్, మెట్రో రైల్, ఇతర శాఖల కార్యాలయాల్లో పచ్చదనం నిర్వహణ కోసం, ఇతర అవసరాలకు శుద్ధి చేసిన నీటిని వినియోగించేలా చూడాలని తెలిపారు. పబ్లిక్ పార్కులు, రోడ్ల శుభ్రతకు కూడా ట్రీటెడ్ వాటర్‌నే వాడాలన్నారు. భవన నిర్మాణంలో శుద్ధి చేసిన నీటినే వాడాలనే నిబంధనను కచ్చితంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రైవేట్ ఎస్టీపీల ఏర్పాటును ప్రోత్సహించాలని, డేటా సెంటర్లకూ శుద్ధి చేసిన నీటిని సరఫరా చేయాలని ఆదేశించారు. ఎస్టీపీల నిర్వహణకు సోలార్ విద్యుత్‌ను వినియోగించే అవకాశాలను పరిశీలించాలని రెడ్కో ఉన్నతాధికారులను ఆదేశించారు. ఎస్టీపీల్లో నీటి శుద్ధికి అత్యాధునిక సాంకేతిక ప్రమాణాలు పాటించాలని చెప్పారు. నీటి నాణ్యత విషయంలో ఏ మాత్రం రాజీ పడొద్దన్నారు. ప్రతి నీటిశుద్ధి కేంద్రం వద్ద ప్రత్యేక అధికారిని నియమించాలని, అన్ని ప్లాంట్లను కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానించి నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ కేంద్రాల పనితీరును ఎప్పటికప్పుడు హైడ్రా పర్యవేక్షించాలని చెప్పారు. ట్రీటెడ్ వాటర్ సరఫరా చేసే ట్యాంకర్లను ట్రాక్ చేసే వ్యవస్థను ఏర్పాటు చేయాలని, ఈ నీటి వినియోగంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ట్రీటెడ్ వాటర్ కోసం ప్రత్యేక టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయాలన్నారు. ఎస్టీపీల నిర్వహణ, ట్రీటెడ్ వాటర్ వినియోగానికి సంబంధించి నవంబర్ 1 నుంచి ఆదేశాలు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ముఖ్యమంత్రి గారు ఆదేశించారు. ప్రస్తుతం 26 ఎస్టీపీల్లో ట్రీటెడ్ వాటర్‌ను గ్రీన్ ట్యాంకర్స్ ద్వారా పంపిణీ చేస్తున్నట్లు జలమండలి అధికారులు వివరించారు. వినియోగదారుల నుంచి కేవలం రవాణా రుసుం మాత్రమే వసూలు చేస్తున్నామని, నీటిని ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు గారితో పాటు సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## 29న ఢిల్లీలో నిర్వహించే కర్టెన్ రైజర్
# కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

హైదరాబాద్ : ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు సంబంధించి ఈ నెల 29న ఢిల్లీలో నిర్వహించే కర్టెన్ రైజర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ భారత్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో నిర్వహించనున్న గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై ముఖ్యమంత్రి ఉన్నతస్థాయి సమావేశంలో సమీక్షించారు. గ్లోబల్ సమ్మిట్ ద్వారా ఔత్సాహిక పారిశ్రామిక పెట్టుబడిదారులు, వ్యాపారవేత్తలతో సమావేశాలు, రక్షా ఎక్స్‌పో, ఇండియా జాయ్ ఈవెంట్లపై ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారు. గ్లోబల్ సమ్మిట్ నిర్వహణతో తెలంగాణ ప్రతిష్ఠ ప్రపంచస్థాయిలో మరింతగా పెరిగే అవకాశం ఉంటుందని, నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. నవంబర్ మొదటి వారంలోగా ప్రణాళికలను ఖరారు చేసుకుని పలు దేశాలు, రాష్ట్రాల నుంచి వచ్చే సీఈఓలు, ప్రతినిధులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. టెక్నాలజీ, ఫార్మా, ఏరోస్పేస్ తదితర రంగాల్లో గొప్ప విజయాలు సాధించిన వివిధ రంగాల ప్రముఖులు, అతిథులకు చాటిచెప్పే విధంగా హైదరాబాద్ నగరవ్యాప్తంగా ప్రచార ఏర్పాట్లు చేయాలన్నారు. నగరంలో పలు చోట్ల డ్రోన్ ఆధారిత ప్రచారం చేపట్టాలన్నారు. క్లైమేట్ చేంజ్, ఏఐ రంగాలకు చెందిన ప్రపంచస్థాయి ప్రముఖులను గ్లోబల్ సమ్మిట్‌కు ఆహ్వానించాలని చెప్పారు. AVGC (యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్) రంగానికి సంబంధించి ప్రత్యేకంగా చేస్తున్న ఏర్పాట్ల గురించి అధికారులు వివరించారు. తెలంగాణ సంస్కృతి ప్రతిబింబించేలా గ్లోబల్ సమ్మిట్ ఆవరణలో డిజైన్ల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కాకతీయ కళాతోరణం, రామప్ప ఆలయం డిజైన్లకు ప్రాముఖ్యతను ఇవ్వాలన్నారు. బతుకమ్మ పండుగ గురించి అతిథులు తెలుసుకునేలా ప్రత్యేకంగా డిజైన్లు, ఏర్పాట్లపై అధికారులు వివరించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు గారితో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## అర్నబ్ తుపానుతో ఇప్పటికే కుండపోత..
# ఏపీకి మరో 7 రోజుల పాటు భారీ వర్ష సూచన

అమరావతి: అర్నబ్ తుపాను ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ లో కుండపోత వానలు కురుస్తున్నాయి. ఈ క్రమంలో రాష్ట్రానికి మరో ఏడు రోజుల పాటు భారీ వర్ష సూచన ఉన్నట్లు భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా, ముఖ్యంగా కోస్తాంధ్ర జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. వాతావరణ శాఖ తాజా నివేదిక ప్రకారం, కోస్తాంధ్ర, యానాంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. కొన్ని చోట్ల అత్యంత భారీ వర్షపాతం నమోదయ్యే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరించారు. తీరం వెంబడి గంటకు 110 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రత్యేకించి తీర ప్రాంతాల వారు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని సూచించారు. ఇప్పటికే ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికి జంకుతున్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు తుపాను పరిస్థితిని ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్షిస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా యంత్రాంగం పూర్తి అప్రమత్తతతో ఉందని, సహాయక చర్యలకు సిద్ధంగా ఉన్నామని అధికారులు తెలిపారు. మరోవైపు, రాయలసీమలో రాబోయే నాలుగు రోజుల పాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ పేర్కొంది.

# వైసీపీ ఓటు బ్యాంక్ ఇంకా తగ్గాలి.. రాష్ట్రం బాగుపడాలంటే అదే మార్గం

అమరావతి: రాష్ట్రంలో వైసీపీ ఓటు బ్యాంకు ఇప్పటికే గణనీయంగా తగ్గిపోయిందని, రాష్ట్రం బాగుపడాలంటే ఆ ఓటు బ్యాంకు మరింత తగ్గాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ లక్ష్య సాధన కోసమే ఎన్డీఏ కూటమి శ్రేణులంతా ఐక్యంగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో టీడీపీ, జనసేన, బీజేపీకి చెందిన 45 వేల మంది ముఖ్య నేతలు, కార్యకర్తలతో బుధవారం ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైసీపీ ఓటు బ్యాంకు పతనం రాష్ట్ర ప్రగతికి సూచికగా మారాలని ఆకాంక్షించారు. గొడ్డలి పార్టీ చతికిల పడిందని, ఆ పార్టీ అధినేత ఒక తీవ్రవాదిలా "హిట్ అండ్ రన్" తరహా రాజకీయాలు చేస్తున్నారని, బెంగళూరు ప్యాలెస్‌లో కూర్చుని రాష్ట్రంపై కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. ఆయన ధ్యాసంతా ప్రజల సంక్షేమంపై కాకుండా, ఆస్తులు కూడబెట్టుకోవడంపైనే ఉందని విమర్శించారు. గొడ్డలి పార్టీ గతంలో చేసిన అరాచకాలు, అకృత్యాలపై ప్రజలను చైతన్యవంతం చేయాల్సిన బాధ్యత కూటమి కార్యకర్తలపై ఉందని దిశానిర్దేశం చేశారు. స్థానిక ఎన్నికలను అడ్డుకోవడానికి ఏకంగా 62 పిటిషన్లు వేసి సుప్రీంకోర్టు వరకు వెళ్లినా, న్యాయస్థానం కూడా వారి కుట్రలను తిరస్కరించిందని అన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు "సుపరిపాలన" అనే నినాదాన్ని విశ్వసించి ఎన్డీఏ కూటమికి చరిత్రాత్మక విజయాన్ని అందించారని చంద్రబాబు అన్నారు. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, కేవలం 28 నెలల కాలంలోనే తమ ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేసిందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం డీఎస్సీ నిర్వహించడం, పేదలకు ఇళ్ల పట్టాలు, రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు అందించడం, గుంతలు లేని రోడ్ల నిర్మాణం వంటి పనులు చురుగ్గా సాగుతున్నాయని వివరించారు. గత ప్రభుత్వం బటన్లు నొక్కడంపై పెట్టిన శ్రద్ధ అభివృద్ధిపై పెట్టలేదని ఎద్దేవా చేశారు. క్యాలెండర్ ప్రకారం సంక్షేమ ఫలాలను అందిస్తుండటంతో ప్రజల్లో ప్రభుత్వం పట్ల పూర్తి సంతృప్తి ఉందని ఆయన పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ఐక్యత అత్యంత కీలకమని చంద్రబాబు ఉద్ఘాటించారు. మూడు పార్టీలు ఉన్నప్పుడు కొన్ని చిన్న చిన్న సమస్యలు సహజమని, అయితే రాష్ట్ర ప్రయోజనాల కోసం వాటిని అధిగమించాలని సూచించారు. పార్టీ అధినేతలు చర్చించి ఖరారు చేసిన అభ్యర్థుల విజయానికే అందరూ కట్టుబడి పనిచేయాలని ఆదేశించారు. ఎవరైనా రెబల్స్‌గా, స్వతంత్రులుగా పోటీలో నిలవడం కూటమి ధర్మానికి పూర్తిగా విరుద్ధమని, అలాంటి చర్యలను సహించేది లేదని హెచ్చరించారు. టికెట్లు ఆశించి భంగపడిన వారికి భవిష్యత్తులో నామినేటెడ్ పదవులు, ఇతర అవకాశాల ద్వారా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం అర్నబ్ తుపాను రూపంలో రాష్ట్రం ఒక విపత్తును ఎదుర్కొంటోందని, ఈ పరిస్థితిని కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు వివరించినట్లు తెలిపారు. ఒకవైపు తుపాను సహాయక చర్యలను సమీక్షిస్తూనే, మరోవైపు పార్టీ వ్యవహారాలకు, ఎన్నికల వ్యూహాలకు సమయం కేటాయిస్తున్నట్లు చెప్పారు. కేంద్రంలో, రాష్ట్రంలో ఎన్డీఏ బలంగా ఉందని, ఇప్పుడు స్థానిక సంస్థలను కూడా గెలుచుకుని "ట్రిపుల్ ఇంజిన్ సర్కార్" ఏర్పాటు చేయాలని ఆకాంక్షించారు. కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు.. ఇలా అన్నీ కైవసం చేసుకుని, 2024 ఎన్నికల్లో వచ్చిన ఓట్ల కంటే ఎక్కువ ఓట్ల శాతాన్ని సాధించాలని లక్ష్యంగా నిర్దేశించారు. సమయం తక్కువగా ఉన్నందున అత్యంత చురుగ్గా పనిచేసి కూటమి అభ్యర్థుల గెలుపును ఖరారు చేయాలని శ్రేణులకు పిలుపునిచ్చారు.

# తుపాను ప్రభావం తగ్గే వరకు క్షేత్ర స్థాయి విధుల్లోనే ఉండాలి

అమరావతి: అర్నబ్ తీవ్ర తుపాను తీరం దాటిన నేపథ్యంలో రాష్ట్ర యంత్రాంగం మొత్తం మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని, తుపాను ప్రభావం పూర్తిగా తగ్గేంత వరకు అధికారులు క్షేత్ర స్థాయిలోనే ఉండి సహాయక చర్యలను పర్యవేక్షించాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. బాపట్ల నుంచి శ్రీకాకుళం వరకు తుపాను ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో బుధవారం మధ్యాహ్నం ఆయన ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. పునరావాస కేంద్రాల్లో ఉన్న ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని, దెబ్బతిన్న మౌలిక సదుపాయాలను యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించాలని ఆదేశించారు. ముఖ్యంగా తుపాను తీరం దాటిన డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని అంతర్వేది పరిసరాలు, కాకినాడ జిల్లా తీర ప్రాంతాలపై పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా దృష్టి సారించారు. తన నియోజకవర్గమైన పిఠాపురం పరిస్థితిపై కూడా ఆరా తీశారు. ఉప్పాడ తీరంలో దెబ్బతిన్న రహదారి, కూలిపోయిన ఇళ్ల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. "ప్రజల భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలి. సహాయక చర్యలను మరింత పకడ్బందీగా చేపట్టాలి. తుపాను ప్రభావం తగ్గాక పంట నష్టం అంచనాలను అత్యంత పారదర్శకంగా నమోదు చేయాలి. చెరువుల గట్లు, వాగులు, వంకల్లో వరద ప్రవాహాన్ని నిరంతరం గమనిస్తూ ప్రజలను అప్రమత్తం చేయాలి" అని పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేశారు.

### గంటకు 140 కి.మీ. వేగంతో గాలుల బీభత్సం

ఈ సమీక్ష సందర్భంగా, అధికారులు తుపాను పరిస్థితిని ఉప ముఖ్యమంత్రికి వివరించారు. యానాంకు దక్షిణంగా అర్ధరాత్రి 1:20 గంటలకు ప్రారంభమైన తీరం దాటే ప్రక్రియ ఉదయం వరకు కొనసాగిందని తెలిపారు.

ఈ సమయంలో గంటకు 115 నుంచి 125 కిలోమీటర్ల వేగంతో పెనుగాలులు వీచాయని, గరిష్ఠంగా గంటకు 140 కిలోమీటర్ల వేగాన్ని కూడా తాకాయని పేర్కొన్నారు. బాపట్ల, కృష్ణా, పశ్చిమ గోదావరి, కోనసీమ, కాకినాడ, తూర్పు గోదావరి, అనకాపల్లి, విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో ఈ గాలుల విధ్వంసం అధికంగా ఉందని అధికారులు నివేదించారు. భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో అనేక ప్రాంతాల్లో రాకపోకలు, విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయాయని వివరించారు. గుంటూరు, ఎన్టీఆర్, ఏలూరు, పోలవరం ఏజెన్సీ ప్రాంతాల్లోనూ భారీ వర్షాలు కురుస్తున్నట్లు తెలిపారు. ఒక్క తూర్పు గోదావరి జిల్లాలోనే 93 రహదారులు దెబ్బతినగా, 736 చెట్లు నేలకొరిగినట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. గాలుల తీవ్రత తగ్గుముఖం పట్టిన ప్రాంతాల్లో రోడ్లపై కూలిన చెట్లను తొలగించడం, విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడం వంటి పనులు తక్షణమే ప్రారంభించామని కలెక్టర్లు తెలిపారు. తీర ప్రాంత గ్రామాల ప్రజలు పునరావాస కేంద్రాల్లో సురక్షితంగా ఉన్నారని, జిల్లాల వారీగా ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ల ద్వారా సహాయక చర్యలను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని ఉప ముఖ్యమంత్రికి వివరించారు.

## ఏపీలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు వాయిదా.. కొత్త తేదీలు ఇవే!

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో జరగాల్సిన జిల్లా పరిషత్, మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ (జెడ్పీటీసీ, ఎంపీటీసీ) ఎన్నికలు వాయిదా పడ్డాయి. గతంలో ప్రకటించిన షెడ్యూల్‌లో రాష్ట్ర ఎన్నికల సంఘం మార్పులు చేసింది. పోలింగ్‌తో పాటు ఓట్ల లెక్కింపు తేదీలను కూడా రెండు రోజుల పాటు వెనక్కి జరిపింది. వివరాల్లోకి వెళితే, గతంలో ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం నవంబర్ 3వ తేదీన జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్ జరగాల్సి ఉంది. అయితే, తాజా నిర్ణయంతో పోలింగ్ తేదీని నవంబర్ 5వ తేదీకి మార్చారు. అదేవిధంగా, నవంబర్ 5న చేపట్టాల్సిన ఓట్ల లెక్కింపు ప్రక్రియను నవంబర్ 7వ తేదీన నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ మార్పులకు గల కారణాలను అధికారులు స్పష్టంగా వెల్లడించనప్పటికీ, పరిపాలనా సౌలభ్యం కోసమే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. మొత్తం మీద, ముందుగా ప్రకటించిన తేదీలతో పోలిస్తే పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియలు రెండూ రెండు రోజుల ఆలస్యంగా జరగనున్నాయి. ఈ మార్పులను అభ్యర్థులు, అధికారులు, ప్రజలు గమనించాలని ఎన్నికల సంఘం సూచించింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల ఏర్పాట్లను కొత్త తేదీలకు అనుగుణంగా అధికారులు సవరించుకుంటున్నారు.

## రాష్ట్రంలో ఎమర్జెన్సీ పాలన నడుస్తోంది
# కాంగ్రెస్ సర్కార్‌పై హరీశ్ రావు ధ్వజం

హైదరాబాద్: మూసీ నది ప్రాజెక్టుపై ప్రజాభిప్రాయ సేకరణకు హాజరుకాకుండా బీఆర్ఎస్ నేతలను గృహనిర్బంధం చేశారని ఆ పార్టీ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎమర్జెన్సీ తరహా పాలన సాగిస్తూ, ప్రతిపక్షాల గొంతు నొక్కుతోందని ఆయన తీవ్రస్థాయిలో విమర్శించారు. హైదరాబాద్‌లోని వాలంతరిలో మూసీ ప్రాజెక్టుపై ప్రజాభిప్రాయ సేకరణ జరగాల్సి ఉంది. ఈ కార్యక్రమానికి హాజరుకావడానికి సిద్ధమైన మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఆమె కుమారుడు కార్తీక్ రెడ్డిలను పోలీసులు శ్రీనగర్ కాలనీలోని వారి నివాసంలో గృహ నిర్బంధం చేశారు. తెల్లవారుజాము నుంచే వారి ఇంటి వద్ద భారీగా పోలీసులు మోహరించి, బయటకు రాకుండా అడ్డుకున్నారు. ఈ ఘటనపై హరీశ్ రావు ఎక్స్ వేదికగా స్పందించారు. "కరవుతో రైతులు అల్లాడుతుంటే ఆదుకోవడం చేతకాని ప్రభుత్వం, రూ. 1.50 లక్షల కోట్లతో మూసీ ప్రక్షాళన పేరుతో కమిషన్ల కోసం ప్రాజెక్టులు చేపడుతోంది" అని ఆరోపించారు. పోలీసులను అడ్డం పెట్టుకుని ప్రజా వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటూ, ప్రతిపక్షాల గొంతును ఎంతకాలం అణచివేస్తారని ప్రశ్నించారు. మూసీ ప్రక్షాళన ముసుగులో జరుగుతున్న దోపిడీ యత్నాలను తెలంగాణ సమాజం తిప్పికొడుతుందని, కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెబుతుందని హెచ్చరించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి కూడా అరెస్టులను ఖండించారు. ఇది అప్రజాస్వామిక చర్య అని, మూసీ పరీవాహక ప్రాంత ప్రజలకు అండగా నిలుస్తున్నందుకే తమను అక్రమంగా నిర్బంధించారని ఆరోపించారు. గృహనిర్బంధంలో ఉన్న బీఆర్ఎస్ నేతలను తక్షణమే విడుదల చేయాలని పార్టీ తరఫున డిమాండ్ చేశారు.

## ఏపీని వణికిస్తున్న అర్నబ్ తుపాను..
# వేర్వేరు ఘటనల్లో 7 మంది మృతి

అమరావతి: ఏపీలో అర్నబ్ తుపాను విషాదాన్ని మిగిల్చింది. తుపాను ప్రభావంతో పలు జిల్లాల్లో భారీ వర్షాలు, బలమైన ఈదురుగాలులు బీభత్సం సృష్టిస్తున్నాయి. ఈ క్రమంలో చోటుచేసుకున్న వేర్వేరు ఘటనల్లో ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. అధికారులు సహాయక చర్యలు చేపడుతున్నారు. వివరాల్లోకి వెళితే, విశాఖపట్నంలో రెండు వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మరణించారు. పాత గోశాల సమీపంలో విద్యుత్ స్తంభం కూలి ఒకరు మృతి చెందగా, సింహాచలం బాలాజీనగర్‌లో బిందు అనే వివాహిత ప్రాణాలు కోల్పోయారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలోనూ ఇద్దరు మృత్యువాత పడ్డారు. చర్చి వద్ద చెట్టు విరిగిపడటంతో చొక్కా కిశోర్ (45), బొండాడవారి వీధిలో కరెంట్ స్తంభం పడటంతో రాంబాబు (34) దుర్మరణం చెందారు. ఇక, కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేదికర ప్రకాశ్ పురంలో ఓ వృద్ధురాలు మరణించారు. పెను గాలులకు గుడిసె కూలిపోవడంతో కొల్లు వెంకాయమ్మ అనే మరో వృద్ధురాలు మరణించారు. అదేవిధంగా అనకాపల్లి జిల్లా ఎలమంచిలిలో విద్యుత్ షాక్‌కు గురై మరో మహిళ మృతి చెందారు. పలు జిల్లాల్లో విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకొరగడంతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది.

## అర్నబ్ తుపాను నష్టంపై కేంద్ర హోంమంత్రి
# అమిత్ షాకు సీఎం చంద్రబాబు లేఖ

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌పై అర్నబ్ తుపాను చూపిన ప్రభావం, రాష్ట్రంలో వాటిల్లిన నష్టంపై ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాకు బుధవారం లేఖ రాశారు. తుపాను కారణంగా రాష్ట్రంలో భారీ నష్టం జరిగిందని, నష్టాన్ని అంచనా వేసేందుకు తక్షణమే కేంద్ర బృందాలను పంపాలని ఆయన విజ్ఞప్తి చేశారు. తుపాను సహాయక చర్యలకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారానికి చంద్రబాబు ధన్యవాదాలు తెలిపారు. తుపాను తీవ్రత, భారీ వర్షాల కారణంగా రాష్ట్రంలోని పలు జిల్లాల్లో పంటలు, ఇళ్లు, రహదారులు, విద్యుత్ స్తంభాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని సీఎం తన లేఖలో వివరించారు. ముఖ్యంగా కోనసీమ, కాకినాడ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, అనకాపల్లి, కృష్ణా జిల్లాల్లో తుపాను ప్రభావం అధికంగా ఉందని పేర్కొన్నారు. ప్రాథమిక అంచనాల ప్రకారం సుమారు 70,900 హెక్టార్లలో వరి పంట నీట మునిగిందని, 10,450 హెక్టార్లలో ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లిందని తెలిపారు. తీర ప్రాంతాల్లో అనేక రహదారులు ధ్వంసం కాగా, సుమారు 180 ఇళ్లు దెబ్బతిన్నాయని, రహదారులపై 220కి పైగా చెట్లు కూలిపోయాయని వెల్లడించారు. దీనివల్ల పలుచోట్ల విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగిందని, పునరుద్ధరణ పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టినట్టు స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ముందస్తు జాగ్రత్త చర్యల కారణంగా ఇప్పటివరకు ఎక్కడా ప్రాణనష్టం నమోదు కాలేదని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. తుపాను ప్రభావిత 14 జిల్లాల్లో సహాయక చర్యల కోసం 16 ఎన్డీఆర్ఎఫ్, 11 ఎస్డీఆర్ఎఫ్ బృందాలను మోహరించినట్టు చెప్పారు. లోతట్టు ప్రాంతాల నుంచి 28 వేల మందికి పైగా ప్రజలను సురక్షిత ప్రాంతాల్లోని పునరావాస కేంద్రాలకు తరలించామని పేర్కొన్నారు. ప్రజలకు సహాయ చర్యలు అందించడం, విద్యుత్, తాగునీటి సరఫరాను పునరుద్ధరించడంపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిందని తెలిపారు. అత్యవసర పరిస్థితులను పర్యవేక్షించేందుకు కంట్రోల్ రూమ్‌లు, రాష్ట్ర అత్యవసర ఆపరేషన్స్ కేంద్రం నిరంతరం పనిచేస్తున్నాయని వివరించారు. తుపాను నష్టంపై పూర్తిస్థాయిలో అంచనా వేసిన అనంతరం కేంద్ర ప్రభుత్వానికి సమగ్ర నివేదికను సమర్పిస్తామని చంద్రబాబు లేఖలో పేర్కొన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న సహాయక చర్యలకు ఎన్డీఆర్ఎఫ్, ఇతర కేంద్ర సంస్థల సహకారం ఇలాగే కొనసాగించాలని కోరారు. రాష్ట్రంలో జరిగిన నష్టాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి, అంచనా వేసేందుకు వీలైనంత త్వరగా కేంద్ర బృందాన్ని పంపాలని అమిత్ షాను ఆయన మరోసారి కోరారు.

## టాటా గ్రూప్‌ను నాశనం చేస్తున్నారు
# మోదీ, అమిత్ షాలపై రాహుల్ గాంధీ ఫైర్

ఢిల్లీ: లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ టాటా గ్రూప్‌పై సంచలన ఆరోపణలు చేశారు. టాటా సంస్థను 'నేరపూరితంగా నాశనం' చేస్తున్నారని, అయినా దేశంలోని వ్యాపారవేత్తలు భయంతో నోరు మెదపడం లేదని ఆయన తీవ్రస్థాయిలో విమర్శించారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా ఆయన ఒక పోస్ట్ చేశారు. "భారతీయ వ్యాపార రంగం మోదీ, అమిత్ షాల ఆటవస్తువు కాదు. మీకు ధైర్యం లేదు, మాకుంది. ఈ నేరాలకు న్యాయం జరిగేలా చూస్తాం" అని రాహుల్ తన పోస్టులో పేర్కొన్నారు. టాటా గ్రూప్‌లో కొంతకాలంగా నడుస్తున్న అంతర్గత వివాదం నేపథ్యంలో రాహుల్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. టాటా సన్స్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా ఎన్. చంద్రశేఖరన్ పునర్నియామకాన్ని టాటా ట్రస్ట్స్ ఛైర్మన్ నోయెల్ టాటా సవాలు చేశారు. సెప్టెంబర్ 17న జరిగిన బోర్డు తీర్మానం చెల్లదని, నియామక ప్రక్రియలో నిబంధనలు పాటించలేదని ఆయన అక్టోబర్ 26న రాసిన లేఖలో ఆరోపించారు. ఈ వివాదం కార్పొరేట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. మరోవైపు, రాహుల్ ఆరోపణలపై బీజేపీ నేత సీఆర్ కేశవన్ స్పందించారు. రాహుల్ గాంధీకి ఆర్థికశాస్త్రంపై అవగాహన లేదని విమర్శించారు.

## తెలంగాణలో భారీగా ఐఏఎస్‌ల బదిలీలు..
# కీలక శాఖలకు కొత్త అధికారులు

హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వంలో పలువురు సీనియర్ ఐఏఎస్ అధికారుల బదిలీలు జరిగాయి. కీలక శాఖలకు నూతన అధికారులను నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు పలువురు అధికారులకు కొత్త పోస్టింగులు కేటాయిస్తూ పరిపాలనలో మార్పులు చేపట్టింది. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం, సీనియర్ ఐఏఎస్ అధికారి జయేష్ రంజన్‌ను పర్యావరణ, అటవీ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా వికాస్ రాజ్‌కు బాధ్యతలు అప్పగించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి మరియు గ్రామీణ నీటి సరఫరా శాఖల బాధ్యతలను నవీన్ మిట్టల్‌కు కేటాయించారు. ఇక రెవెన్యూ (దేవాదాయ) శాఖకు శైలజ రామయ్యర్‌ను, క్రీడలు మరియు వారసత్వ శాఖకు ఎ. వాణి ప్రసాద్‌ను బదిలీ చేశారు. రాహుల్ బొజ్జాకు గిరిజన సంక్షేమ శాఖ అదనపు బాధ్యతలు అప్పగించారు. రవాణా శాఖ కార్యదర్శిగా కె. ఇలంబర్తి, వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శిగా ముషారఫ్ అలీ ఫరూఖీ నియమితులయ్యారు. జీహెచ్ఎంసీతో పాటు సైబరాబాద్, మల్కాజ్‌గిరి కార్పొరేషన్ల అదనపు బాధ్యతలను సర్ఫరాజ్ అహ్మద్‌కు కేటాయించారు. మహిళా, శిశు, దివ్యాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ బాధ్యతలను శ్రుతి ఓఝాకు అప్పగించగా, మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్‌గా డాక్టర్ సంగీత సత్యనారాయణ బాధ్యతలు స్వీకరించనున్నారు. టీజీఎస్పీడీసీఎల్, టీజీరెడ్కో బాధ్యతలను జితేష్ వి. పాటిల్‌కు కేటాయించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజూ ఉత్తర్వులు జారీ చేశారు.

## తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన కరవు మండలాల
# జాబితాపై బండి సంజయ్ విమర్శలు

హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన కరవు మండలాల జాబితాపై కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఈ జాబితా అత్యంత అశాస్త్రీయంగా, పక్షపాత ధోరణితో ఉందని ఆయన ఆరోపించారు. కేవలం మొక్కుబడిగా ఈ జాబితాను తయారు చేశారని మండిపడ్డారు. ముఖ్యంగా కరీంనగర్ పార్లమెంటరీ నియోజకవర్గానికి ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని బండి సంజయ్ అన్నారు. 35 శాతం వర్షపాతం లోటు ఉన్న మండలాలను కూడా జాబితాలో చేర్చకపోవడం ప్రభుత్వ ఉద్దేశాన్ని స్పష్టం చేస్తోందన్నారు. హుస్నాబాద్, వేములవాడ, సిరిసిల్ల, మానకొండూరు, చొప్పదండి, హుజూరాబాద్ నియోజకవర్గాల్లోని తీవ్ర కరవు పరిస్థితులు ప్రభుత్వానికి కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. పంట పొలాలు బీళ్లుగా మారినా, ప్రజలు తాగునీటి ఎద్దడితో అల్లాడుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. నష్టపరిహారం ఖర్చులు తప్పించుకోవాలనే ఉద్దేశంతోనే కరీంనగర్‌ను ఉద్దేశపూర్వకంగా విస్మరించారా? అని ఆయన నిలదీశారు. క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటించి రైతులతో మాట్లాడితేనే కరవు తీవ్రత స్పష్టంగా తెలుస్తుందని సూచించారు. కరవు మండలాలను ఏ ప్రాతిపదికన, ఏ గణాంకాల ఆధారంగా గుర్తించారో తెలుపుతూ ప్రభుత్వం తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రతి మండలానికి వర్షపాతం లోటు, సాగు విస్తీర్ణం, పంట నష్టం, భూమిలో తేమ వంటి అంశాలను విడివిడిగా పరిశీలించి, అర్హులైన అన్ని మండలాలను జాబితాలో చేర్చాలని కోరారు. ప్రభుత్వం రాజకీయ ప్రయోజనాలను పక్కనపెట్టి, వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాలని హితవు పలికారు. లేనిపక్షంలో రైతుల పక్షాన పోరాటాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.

## వెయ్యి కి.మీ. రేంజ్ మిస్సైళ్లు...
# శిక్షణ కోసం భారత్ వైపు జపాన్ చూపు

ఢిల్లీ: భారత్, జపాన్ మధ్య రక్షణ సంబంధాలు మరింత బలపడుతున్నాయి. తమ సైన్యానికి అత్యాధునిక క్షిపణుల వినియోగంపై శిక్షణ ఇచ్చేందుకు భారత్‌లోని శిక్షణా కేంద్రాలను వినియోగించుకోవాలని జపాన్ భావిస్తోంది. ఈ మేరకు తమ సిబ్బందిని చర్చల కోసం భారత్‌కు పంపినట్లు జపాన్ గ్రౌండ్ సెల్ఫ్ డిఫెన్స్ ఫోర్స్ (జీఎస్‌డీఎఫ్) చీఫ్ ఆఫ్ స్టాఫ్ జనరల్ మసయోషి అరాయ్ స్వయంగా వెల్లడించారు. సుమారు 1,000 కిలోమీటర్ల పరిధి కలిగిన ఉపరితలం నుంచి నౌకలను ఛేదించే క్షిపణులపై సమర్థవంతమైన శిక్షణ ఇవ్వడం తమకు పెద్ద సవాలుగా మారిందని జనరల్ అరాయ్ తెలిపారు. ఈ నేపథ్యంలో దేశీయంగా, విదేశాల్లో శిక్షణా అవకాశాలను పరిశీలిస్తున్నామని, ఇందులో భాగంగానే భారత్‌తో సంప్రదింపులు జరుపుతున్నామని వివరించారు. కేవలం క్షిపణులే కాకుండా, చిన్న తరహా అటాక్ డ్రోన్ల ప్రయోగానికి గల అవకాశాలపై కూడా చర్చిస్తున్నట్లు ఆయన ధ్రువీకరించారు. సంక్లిష్టంగా మారిన భద్రతా వాతావరణంలో ఇండో-పసిఫిక్‌లో భారత్‌ను జపాన్ ఒక ముఖ్యమైన భాగస్వామిగా చూస్తోందని, రక్షణ సహకారాన్ని మరింత పటిష్ఠం చేసుకోవాలని కోరుకుంటోందని విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే, భారత్‌తో ఉన్న సంబంధాల సున్నితత్వం దృష్ట్యా పూర్తి వివరాలను వెల్లడించలేనని జనరల్ అరాయ్ పేర్కొన్నారు. కాగా, ఈ నెల 6 నుంచి 9 వరకు జపాన్ జీఎస్‌డీఎఫ్ కమాండ్ నుంచి 34 మంది సభ్యుల ప్రతినిధి బృందం భారత్‌లో పర్యటించింది. ఈ బృందం భారత సైన్యం, డీఆర్‌డీవో అధికారులతో సమావేశమైంది. వార్‌డెక్, క్లాస్ వంటి కేంద్రాలను సందర్శించి భారత రక్షణ సామర్థ్యాలు, సైనిక శిక్షణ, ఆధునిక సాంకేతికత గురించి తెలుసుకున్నారు. ఈ పర్యటన ఇరు దేశాల మధ్య వృత్తిపరమైన సైనిక సంబంధాలను మరింతగా పెంచేందుకు దోహదపడింది.

## ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు అన్ని శాఖల అధికారులు సిద్ధంగా ఉండాలి

- పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

చౌడపూర్ లో మండల స్థాయి సమీక్ష సమావేశం..

పాల్గొన్న పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి



వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్): చౌడపూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన మండల స్థాయి సమీక్ష సమావేశంలో ఎల్‌నినో ప్రభావం వల్ల ఎదురయ్యే పరిస్థితులు,కరువును ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై పరిగి ఎమ్మెల్యే,టీపీసీసీ ట్రైనింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి వివిధ శాఖల అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావంపై ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎల్‌నినో వల్ల వర్షపాతంలో మార్పులు సంభవించే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులకు ముందస్తు అవగాహన కల్పించడం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ఎల్‌నినో ప్రభావం, వ్యవసాయ రంగంపై దాని ప్రభావం, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామస్థాయిలో ప్రజలకు, రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటిస్తూ అందుబాటులో ఉన్న నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవాలని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో కరువు పరిస్థితులు ఎదురైనప్పటికీ వాటిని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ముందస్తు ప్రణాళికలను సిద్ధం చేస్తోందని పేర్కొన్నారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పిఏసి చైర్మన్ భీమ్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చంద్రశేఖర్, పిఏసిఎస్ వైస్ చైర్మన్ అశోక్ కుమార్, సర్పంచ్ నవీన్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## చౌడాపూర్‌లో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం..

- ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి



వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్): చౌడాపూర్ మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమానికి పరిగి ఎమ్మెల్యే, టీపీసీసీ ట్రైనింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన గృహంలోకి అడుగుపెట్టిన లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. నూతన గృహంలో లబ్ధిదారుల కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. అనంతరం లబ్ధిదారులు ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి ని సన్మానించి,తమకు ఇందిరమ్మ ఇల్లు మంజూరై నిర్మాణం పూర్తిచేసుకుని గృహప్రవేశం చేసుకున్న సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పిఏసిఎస్ చైర్మన్ భీమ్ రెడ్డి, వైస్ చైర్మన్ అశోక్ కుమార్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు చంద్రశేఖర్, సర్పంచ్ నవీన్, తదితరులు పాల్గొన్నారు.

## తుంకులగడ్డలో తాగునీటి సమస్యకు తక్షణ పరిష్కారం

-కౌన్సిలర్ అభిబ్ ఉన్నిసా అయుబ్



వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్): కాలనీలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలవకుండా నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటానని వార్డు కౌన్సిలర్ హబీబ్ ఉన్నిసా అయూబ్ అన్నారు. ఎనిమిదో వార్డులో ఈరోజు మిషన్ భగీరథ నీరు రాకుండా ఆగిపోవడంతో వార్డులోని ప్రజలు తాగునీరు ఇబ్బంది అవుతున్నది గమనించి వెంటనే వార్డు కౌన్సిలర్ అభిబ్ ఉన్నిసాయుబ్ వాటర్ ట్యాంక్ ఏర్పాటు చేసి అప్పటికప్పుడు వార్డులో ప్రతి ఒక్కరి ఇంటికి నీటిని సరఫరా చేశారు కాలనీవాసులకు ఎటువంటి ఇబ్బందులు కలవకుండా నిరంతరం ప్రజలతో కలిసిమెలిసి ఉండడమే నా ధ్యేయమని పేర్కొన్నారు. ప్రజలకు నిరంతర అందుబాటులో ఉంటూ వారి సేవ చేయడమే పరమావధిగా భావిస్తున్నానని ఎనిమిదో వార్డును పరిగి మున్సిపాలిటీలో ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. నాపై ఎంతో నమ్మకం ఉంచి నన్ను వాడు కౌన్సిలర్ గా గెలిపించిన కాలనీవాసులకు మరోసారి కృతజ్ఞతా భావంగా ధన్యవాదాలు తెలియజేస్తూ వార్డును అన్ని రంగాలలో ముందుకు తీసుకువెళ్తానని పేర్కొన్నారు.



## మోదీ సొంత నియోజకవర్గంలో బీజేపీకి షాక్!



లక్నో: ఉత్తరప్రదేశ్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ (బీజేపీ)కి ఎదురుదెబ్బ తగిలింది. ప్రధాని నరేంద్ర మోదీ పార్లమెంటరీ నియోజకవర్గమైన వారణాసిలో బీజేపీ ఓటమి పాలైంది. ఇప్పటివరకు అందిన సమాచారం ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌లోని 11 ఎమ్మెల్సీ స్థానాల్లో బీజేపీ ఐదు స్థానాలను గెలుచుకోగా, సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) రెండు స్థానాల్లో విజయం సాధించింది. ఉత్తరప్రదేశ్‌తో పాటు మరో మూడు రాష్ట్రాల్లోని మొత్తం 28 ఎమ్మెల్సీ నియోజకవర్గాలకు ఎన్నికలు జరిగాయి. వీటిలో ఉత్తరప్రదేశ్‌లో 11 స్థానాలు ఉన్నాయి. అక్టోబర్ 23న ఈ స్థానాలకు పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. బహుళ అంచెల భద్రతా ఏర్పాట్ల మధ్య ఓటింగ్ నిర్వహించారు. అక్టోబర్ 27న ఓట్ల లెక్కింపు చేపట్టారు. ఉత్తరప్రదేశ్‌లో ఐదు గ్రాడ్యుయేట్, ఆరు ఉపాధ్యాయ నియోజకవర్గాలకు ఎన్నికలు జరిగాయి. లక్నో, వారణాసి, ఆగ్రా, మీరట్, అలహాబాద్-ఝాన్సీ గ్రాడ్యుయేట్ నియోజకవర్గాలతో పాటు లక్నో, వారణాసి, ఆగ్రా, మీరట్, బరేలీ-మొరాదాబాద్, గోరఖ్‌పూర్-ఫైజాబాద్ ఉపాధ్యాయ నియోజకవర్గాల్లో పోలింగ్ నిర్వహించారు.

## 'టాటాను నాశనం చేస్తున్నారు'.. రాహుల్ గాంధీ ఫైర్!

న్యూఢిల్లీ: దేశంలోని ప్రముఖ పారిశ్రామిక సంస్థ టాటా గ్రూప్ వ్యవహారంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సంచలన వ్యాఖ్యలు చేశారు. టాటా గ్రూప్‌ను 'నేరపూరితంగా నాశనం చేస్తున్నారని' ఆరోపించారు. ఈ పరిణామాలపై దేశంలోని ఏ వ్యాపారవేత్త కూడా నోరు విప్పడానికి ధైర్యం చేయడం లేదని విమర్శించారు. వ్యాపారవేత్తలు ఇంకెంతకాలం మౌనంగా ఉంటారని ప్రశ్నించారు. ఈ మేరకు బుధవారం సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఆయన ఒక పోస్టు చేశారు. టాటా గ్రూప్ విషయంలో జరుగుతున్న పరిణామాలపై వ్యాపారవేత్తలు మౌనం వీడాలని రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు. 'టాటా గ్రూప్‌ను నాశనం చేస్తున్నా, ఏ వ్యాపారవేత్త కూడా మాట్లాడటానికి ధైర్యం చేయడం లేదు. ఇంకెంతకాలం మౌనంగా ఉంటారు? వారు మిమ్మల్ని పూర్తిగా తమ స్వాధీనంలోకి తీసుకునే వరకు వేచి చూస్తారా? భారత వ్యాపార రంగం మోదీ, అమిత్ షాల ఆటబొమ్మ కాదు. మీకు ధైర్యం లేదు. మాకు ఉంది. ఈ నేరాలకు న్యాయం జరిగేలా చూస్తాం' అని ఆయన పేర్కొన్నారు. ఈ ఆరోపణలపై బీజేపీ, టాటా గ్రూప్ నుంచి ఇంకా స్పందన రాలేదు. దేశంలోని పురాతన పారిశ్రామిక సంస్థల్లో ఒకటైన టాటా గ్రూప్‌లో కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో రాహుల్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. గ్రూప్ హోల్డింగ్ కంపెనీ టాటా సన్స్, దానిలో కీలక వాటాదారుగా ఉన్న టాటా ట్రస్ట్స్ మధ్య విభేదాలు నెలకొన్నాయి. సెప్టెంబర్ 17న ఎన్. చంద్రశేఖరన్‌ను టాటా సన్స్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా మరో ఐదేళ్లపాటు నియమించేందుకు తీసుకున్న నిర్ణయాన్ని టాటా ట్రస్ట్స్ ఛైర్మన్ నోయెల్ టాటా వ్యతిరేకించారు. 2022లో చంద్రశేఖరన్ పునర్నియామకానికి అనుసరించిన విధానానికి భిన్నమైన రాజ్యాంగపరమైన మార్గాన్ని ఈసారి అనుసరించారని ఆయన అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. టాటా ట్రస్ట్స్ వాదన ప్రకారం.. ఛైర్మన్ పునర్నియామకానికి సంబంధించి ట్రస్ట్స్ నామినేట్ చేసిన డైరెక్టర్లలో మెజారిటీ మద్దతు తప్పనిసరి. ఆ మద్దతు లేనప్పుడు ఛైర్మన్‌కు ఉండే నిర్ణయాత్మక ఓటు హక్కుతో సమస్యను అధిగమించలేరని ట్రస్ట్స్ అభిప్రాయపడుతున్నాయి. మరోవైపు, టాటా సన్స్ సంస్థ ఆర్టికల్స్ ఆఫ్ అసోసియేషన్‌లోని 104బీ, 118, 121 నిబంధనలను ఆధారంగా చేసుకుంటోంది. ఓట్ల సంఖ్య సమానమైనప్పుడు ఛైర్మన్‌కు నిర్ణయాత్మక ఓటు హక్కు ఉంటుందనే నిబంధనపైనా చర్చ జరుగుతోంది.

# స్థలకాల సందిగ్ధంలో...



స్థలకాలాలను మనిషి శాసిస్తాడా లేక స్థలకాలాలే మనిషిని శాసిస్తాయా అని అడిగితే ఠక్కున సమాధానం చెప్పడం కష్టం. ఎందుకంటే, సాధారణంగా ఆ అనుశాసనం భార్యా భర్తల సంబంధంలా పరస్పరమవుతుంది; మనిషి స్థలకాలాలను శాసిస్తున్నట్టు కనిపి స్తూనే, స్థలకాలాల శాసనానికి లొంగిపోతూ ఉంటాడు. ఈ క్షణాన ప్రపంచవ్యాప్తంగా అనేక రంగాలలో అదే జరుగుతోంది. ఇంటర్నెట్ వంటి అత్యాధునిక సాంకేతిక సంపత్తి అందుబాటులోకి వచ్చి స్థలకాలాలతో మనిషి సంబంధంలో అనూహ్యమైన వేగమూ, అనేకమైన మార్పులూ తెచ్చి అతణ్ణి అరచేతి బొమ్మలా ఆడిస్తోంది. తను కనిపెట్టిన సాంకేతికత చేతిలో ఒక్కోసారి తనే చిత్తవుతూ మనిషి కళ్ళు తేలేయవలసివస్తోంది. ఎంతమంది గమనించారో కానీ, ఈ అత్యాధునిక సాంకేతికత పుణ్యమా అని కవి, రచయితలతో సహా ఏదో ఒక రచనారంగానికి చెందిన బుద్ధిజీవులందరూ ఈరోజున స్థలకాలసంబంధమైన ఒక సమస్యను ఎదుర్కొంటున్నారు. ఒక రచన ఆక్రమించుకునే జాగాను ఇక్కడ స్థలమనుకుంటే, ఆ రచన పాఠకులు, లేదా శ్రోతలముందుకు రావడానికి పట్టే సమయాన్ని కాలమనుకుందాం. లిపీ, లేఖనం అభివృద్ధి చెందని మౌఖిక సంప్ర దాయపు రోజుల్లో కవీ లేదా కథకుడూ-- శ్రోతలూ ఎదురెదురుగా ఉండేవారు కనుక స్థల కాలసంబంధమైన అంతరాలు ఉండేవికావు. లేఖన సంప్రదాయం వచ్చి, తాళపత్రాల దశను కూడా దాటి కాగితం మీద రాయడమూ, ముద్రించడమూ, ఆపైన పత్రికలూ వచ్చాక కాగితం మీద ఆ రచన ఆక్రమించుకునే నిడివి రూపంలో స్థలమూ, పాఠకులకది చేరే వ్యవధి రూపంలో కాలమూ ప్రముఖంగా అడుగుపెట్టాయి. ఇలాంటి లేఖనసంప్రదాయం తాళపత్రాలతో మొదలుపెట్టి, వందల సంవత్సరాల పాటు కొనసాగిన తర్వాత మళ్ళీ మనం స్థలకాల అంతరాలకు అవకాశం లేని వెనకటి మౌఖిక సంప్రదాయపు రోజులకు చేరుకున్నాం! ఎలాగంటే, ఆ సంప్రదాయంలో కవులూ, కథకులూ తమ రచనను శ్రోతలకు తక్షణమే అందించినట్టుగా ఈరోజున ఇంట ర్నెట్ ఆధారిత సామాజిక మాధ్యమాల్లో రచయితలు తమ రచనలను పాఠకులకు తక్షణమే అందించగలుగుతున్నారు; దానికి తోడు, లేఖన, ముద్రణానుభవాలకుభిన్నంగా ఈ మాధ్యమాల్లో స్థలపరిమితులు కూడా పూర్తిగా మాయమవుతున్నాయి. ఈవిధంగా రచనాకాలచక్రం చిత్రంగా తిరిగి బయలు దేరినచోటికే వచ్చింది! మారిన ఈ పరిస్థితికి అనుగుణంగా తాము మారి, తమ రచనలను ఎలా మలచు కోవాలన్నదే ఈ రోజున ఎంతోమంది రచయితలు అప్రకటితంగా ఎదుర్కొంటున్న సమస్య. ఉదాహరణకే చూడండి, ఆయా రచనాప్రక్రియల్లో చేయి తిరిగినవారిలో అనేకులు నిన్నటివరకూ దిన, వార, మాస పత్రికలు నిర్దేశించిన స్థలకాలపరిమితులకూ, ప్రమాణాలకూ లోబడి రాయడానికి అలవాటుపడినవాళ్ళు; అలాగే తమ రచన పాఠకు లకు చేరేందుకు పట్టే వ్యవధికీ మానసికంగా సిద్ధమై ఉండేవారు. నేరుగా పుస్తకరూపంలో తమ రచనల్ని ముద్రించుకునేవారూ దాదాపు ఈ కోవలోకే వస్తారు. కానీ ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాల వ్యాప్తితో స్థలకాలపరిమితులే కాక, ప్రమాణాలను నిర్దేశించుకుని పరిష్కరణ బాధ్యత వహించే సంపాదకవర్గం కూడా మటుమాయమై ప్రతి రచయితా, కవీ, కథకుడూ తన 'గోడ'కు తనే యజమానిగా, సంపాదకుడిగా అదనపు బాధ్యతలను మోయవలసివస్తోంది. రచన చేయడానికే తప్ప పాఠకులకు దానిని చేర్చడానికి పట్టే వ్యవధి క్షణాలకు కుదించుకుపోవడం ఒక సానుకూల పరిణామనుకున్నా, స్థలపరి మితులు మాయమైపోయిన స్థితిలో పాఠకుల సహనమే కొలమానంగా పరిమితులను నిర్ణయించుకోవలసిన బాధ్యతా రచనాకారులపైనే పడుతోంది. అంతేకాదు, పత్రికలవంటి మాధ్యమాలు నిర్దేశించిన చట్రంనుంచి రచనలు తప్పుకుని వస్తురూపాలూ, అభివ్యక్తుల పరంగా కొత్తరూపాలు ధరించడమూ జరుగుతోంది. ఆపైన సామాజిక మాధ్యమాలు నిపుణరచయితలతో ప్రారంభించి, అరకొరగా అక్షరజ్ఞానం ఉన్నవారి వరకూ అందరికీ అందుబాటులోకి రావడంతో తమ స్థాయినీ, ప్రత్యేకతనూ నిలుపు కోవడం చేయి తిరిగిన రచనాకారులకు సవాలుగా మారుతోంది. స్థల, కాలనిర్బంధాలకు అతీతంగా తమవైన అద్భుత సృజనశక్తులను చాటుకుంటూ మహాకవులుగా, కథకులుగా, నవలాకారులుగా చిరకీర్తినందుకున్న చరిత్రా అనేకమంది సాహిత్యకారులకుంది కనుక, ఇప్పుడూ అదే జరగడం తథ్యమే కానీ, దానికి ఎంత వ్యవధి పడుతుందన్నదే ప్రశ్న!

# నెతన్యాహూకు అగ్నిపరీక్ష!



బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డ సిల్వా ఆదివారంనాటి అధ్యక్ష ఎన్నికల్లో సాధించిన విజయంతో నిండా షాక్‌లో మునిగిపోయిన అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్... 120 మంది సభ్యులుండే ఇజ్రాయెల్ పార్లమెంటు కెనెసెట్‌కు మంగళవారం జరిగే ఎన్నికల్లో తన ఆప్తమిత్రుడు ప్రధాని బెంజిమిన్ నెతన్యాహూ పరిస్థితి ఏమవుతుందోనని బెంగటిల్లి ఉంటారు. మూడేళ్ల క్రితమైతే నెతన్యాహూ ఓటమి ఖాయమని అందరూ ఘంటాపథంగా చెప్పేవారు. ఎందుకంటే న్యాయసంస్కరణల పేరుతో సుప్రీంకోర్టు అధికారాలకు కోత పెడుతూ ఆయన ప్రభుత్వం 2023లో చట్టం తెచ్చాక దేశంలో ఉద్యమాలు పెల్లుబికాయి. తనపై ఉన్న అవినీతి కేసుల్ని తప్పించుకోవటానికే ఆ చట్టం తెచ్చారని అన్ని వర్గాలూ విరుచుకుపడ్డాయి. న్యాయమూర్తుల నియామకాన్ని ప్రభుత్వ నియంత్రణలోకి తెచ్చు కోవటంతో పాటు... పార్లమెంటు తెచ్చే ఏ చట్టాన్నయినా రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించటానికి దానికుండే అధికారాన్ని కూడా ఆ చట్టం రద్దు చేసింది. సుప్రీంకోర్టు తీర్పును సాధారణ మెజారిటీతో పార్లమెంటు తోసిపుచ్చడానికి కూడా అది వీలుకల్పించింది. రెండేళ్ల క్రితం ఈ చట్టాన్ని సుప్రీంకోర్టు 8--7 మెజారిటీతో కొట్టేసింది. పర్యవసానంగా అవినీతి కేసుల కత్తి నెతన్యాహూపై వేలాడుతోంది. 2023 అక్టోబర్‌లో ఉగ్రవాద సంస్థ హమాస్ పలువురు ఇజ్రాయెల్ పౌరుల్ని హతమార్చి, అనేకమందిని కిడ్నాప్ చేశాక పరిస్థితి మారింది. గాజాపై నెతన్యాహూ సైన్యాన్ని నడిపించి వేలాదిమంది పౌరుల్ని ఊచకోత కోయించారు. గ్రామాలకు గ్రామాలు నేలమట్టం అయ్యాయి. తాను తప్ప ఎవరూ దేశాన్ని రక్షించలేరన్న అభిప్రాయం కలగజేయటానికి ఆయన మూడేళ్లుగా ఆ నరమేథాన్ని సాగిస్తూనే ఉన్నారు. దాదాపు రెండు దశాబ్దాలుగా నెతన్యాహూ దేశ రాజకీయాలను శాసిస్తున్నారు. అన్ని సర్వేలూ అధికార కూటమి లేదా విపక్ష కూటమి పూర్తి స్థాయి మెజారిటీ తెచ్చుకునే అవకాశం లేదని చెబుతున్నాయి. ఈ అనిశ్చితి కూడా నెతన్యాహూకే తోడ్పడుతుంది. ఇజ్రాయెల్‌లో మితవాద పక్షాలదే ఎప్పుడూ పైచేయి. అయితే గత ఎన్నికల్లో నెతన్యాహూ నెలకొల్పినలాంటి అతి మితవాద ప్రభుత్వం గతంలో ఎప్పుడూ లేదు. అందరూ దూరంపెట్టిన అతి తీవ్ర మతవాద పక్షాలను అధికారాన్ని నిలుపుకోవటం కోసం, జైలుశిక్ష తప్పించుకోవటం కోసం ఆయన చేరదీశారు.

ఆ పక్షాలకు ఉదారవాద విధానాలు ప్రబల శత్రువులు. దౌత్యంకన్నా యుద్ధమే మేలైనదని వారి దృఢవిశ్వాసం. పాలస్తీనా భూభాగాన్ని మొత్తం స్వాధీనం చేసుకుని విశాల ఇజ్రాయెల్ నెలకొల్పటం వారి ధ్యేయం. ఆ సిద్ధాంతాన్ని సాకారం చేసి, దేశంలో తిరుగులేని నేతగా నిలిచిపోవాలని నెతన్యాహూ వాంఛించారు. హమాస్ దాడి ఆయనకు ఈ అవకాశాన్నిచ్చింది. అయితే మూడేళ్లుగా నిరాయుధ గాజా పౌరులపై సాగిస్తున్న ఊచకోత కొంతమేర విజయాన్నిచ్చి నట్టు కనబడ్డా, ప్రతిఘటన మాత్రం చల్లారలేదు. దేశం మొత్తం యుద్ధంలో చిక్కుకుంది. పాలస్తీనా పౌరుల వరకూ ఇజ్రాయెల్‌లో ఎవరొచ్చినా ఒకటే. సిద్ధాంతాలు వేరైనట్టు కనబడినా, ఆ పార్టీలన్నీ పాలస్తీనా స్వతంత్ర ప్రతిపత్తికి వ్యతిరేకం. హమాస్ దాడి, గాజా ఊచకోత అనంతరం ఇజ్రాయెల్ సమాజం మరింత పిడివాదంలోకి జారుకుంది. అందుకే విపక్షాలు గాజాకు భిన్నమైన పరిష్కారం చెప్పడంలేదు. న్యాయసంస్కరణలు రద్దు చేస్తామని మాత్రమే అంటున్నాయి. నెతన్యాహూ కోసం ట్రంప్ తన వంతుగా సాయం చేస్తున్నారు. ఈ ఎన్నికల్లో ఓటేయటానికి అమెరికాలో స్థిరపడిన ఇజ్రాయెలీ పౌరులు మందలుగా పోవటం ఆయన చలవే. అటు బ్రెజిల్‌లో లూలా ఓటమికి ప్రయత్నించినట్టే ఇక్కడా చేతనైనంత చేస్తున్నారు. కానీ జైలుశిక్ష అనుభవిస్తున్న బోల్సొనారో కుమారుడు ఫ్లేవియో ఓటమి పాలు కాకతప్పలేదు. ఇప్పుడు నెతన్యాహూ భవితవ్యం ఏమిటన్న ఉత్కంఠ అందరిలో ఉంది. నెతన్యాహూ ఏలుబడిలో ఇజ్రాయెల్ తెంపరితనం పెరిగింది. అది మిత్రుల సలహాలను కూడా బేఖాతరు చేస్తుందనీ, తమకు వీసమెత్తు విలువీయదనీ పాశ్చాత్య దేశాల ప్రభుత్వాలు భావిస్తున్నాయి. నెతన్యాహూ చిత్తుగా ఓడిపోవాలని ఆ దేశాల జనం కూడా కోరుకుంటున్నారు. దారీతెన్నూ లేని ఈ నిరంతర యుద్ధం అంతిమంగా దేశ భవిష్యత్తుకు చేటు తెస్తుందని ఇజ్రాయెల్ పౌరులు గ్రహిస్తారా లేదా అన్నది ఈ ఎన్నికల ఫలితాలు తేలుస్తాయి.

# యువకెరటం జయకేతనం!



శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్ తర్వాత మరో దేశమైన సెర్బియాలో సైతం యువతరం తడాఖా చూపింది. ఆగ్నేయ యూరోప్‌లో డాన్యూబ్, సావా నదుల సంగమస్థలమైన దాని రాజధాని నగరం బెల్‌గ్రేడ్ సోమవారం లక్షలమంది జనంతో ఉప్పొంగిపోయింది. ఒక నాయకుడంటూ లేకుండా, నిర్దిష్టమైన విధివిధానాలు రూపొందించుకోకుండా విద్యార్థులు ఏకమై నెలకొల్పిన స్టూడెంట్ లిస్ట్ పార్టీ 53.3 శాతం ఓట్లతో, 140 స్థానాల్లో జయభేరి మోగించటం ఆ విజయోత్సవానికి కారణం. 250 స్థానాలున్న పార్లమెంటుకు పన్నెండేళ్ల క్రితం అధికారంలోకొచ్చిన ప్రస్తుత అధ్యక్షుడు అలెక్సాండర్ వూచిచ్ ఆ పక్కనున్న రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ను ఆదర్శంగా తీసుకుని రెండుసార్లు అధ్యక్షుడిగా పనిచేసి, మూడోసారికి కుదరదు గనుక ప్రధానిగా తిరిగొద్దామని ఎత్తుగడ వేశారు. కానీ తన పొరుగునున్న హంగేరీ అధ్యక్షుడు విక్టర్ ఒర్బాన్‌కు ఏమైందో గమనించుకోలేదు. తన మాదిరే ఎన్నికల సంఘం మొదలుకొని న్యాయవ్యవస్థ, మీడియా, పారిశ్రామికరంగం వరకూ అన్నిటినీ అధీనంలోకి తెచ్చుకుని తిరుగులేని అధికారం చలాయించిన ఒర్బాన్ పదహారేళ్ల అనంతరం మొన్న మే నెలలో పదవీచ్యుతుడయ్యారు. దాన్నుంచి వూచిచ్ ఏమీ నేర్చుకోలేదు సరిగదా... అవినీతి భూతాన్ని అదుపు చేద్దామన్న స్పృహ కూడా కొరవడింది. శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్ దేశాల్లో యువతరం హింసామార్గానికి మళ్లింది. అధికార సౌధాలపై దాడులకు దిగింది. పాలకుల్ని తరిమికొట్టింది. కానీ సెర్బియా యువతరం ఇందుకు భిన్నం. ప్రభుత్వం ఎంత రెచ్చగొట్టినా శాంతియుత మార్గాన్ని వీడలేదు. అందుకే రెండేళ్లనుంచి ఉద్యమం నిలకడగా సాగింది. దాన్ని అణిచేయటానికి వూచిచ్ చేయని ప్రయత్నమంటూ లేదు. తుపాకుల ప్రయోగం మినహా చేయాల్సిందంతా చేశారు. రాత్రి వేళల్లో అరెస్టులు, లాఠీచార్జిలు, పెప్పర్ స్ప్రే ప్రయోగాలు, ఉద్యమవేదికల్ని హఠాత్తుగా నిషేధిత ప్రాంతాలుగా ప్రకటించటం వగైరాలన్నీ ఉపయోగించారు. మాఫియా ముఠాలను రంగంలోకి దించారు. చురుగ్గా పనిచేసే నేతల్ని బెదిరించటం, దౌర్జన్యానికి దిగటం, ప్రధాన నగరాల్లో ప్రభుత్వ భవనాల దరిదాపుల్లోకొచ్చే యువకుల్ని బెదర గొట్టడం, ఇళ్లకు వెళ్లి చంపేస్తామని బెదిరించటం ఈ ముఠాల పని. ఉద్యమ నేతలను విదేశీ శక్తుల కిరాయిమనుషులుగా అనుకూల మీడియా సాగించిన ప్రచారం... ఉద్యమ కారుల బంధుమిత్ర గణం ద్వారా జనానికి చేరే సమాచారం ముందు వీగిపోయింది. విద్యార్థులు స్టూడెంట్ లిస్ట్ నేతలుగా వెలిగిపోవాలనుకోలేదు. నిజానికి 250 మంది జాబితాలో ఒక్క విద్యార్థి కూడా లేదు. రైతుల్ని, విశ్వవిద్యాలయ ప్రొఫెసర్లను, నటుల్ని, ఒపేరా గాయకుల్ని, క్రీడాకారుల్ని, వైద్యరంగ నిపుణుల్ని అభ్యర్థులుగా ఎంపిక చేసు కున్నారు. సంప్రదాయ పద్ధతుల్లో పార్టీ నెలకొల్పాలా వద్దా అని ఊగిసలాడినా చివరకు వివిధ నగరాలు, పట్టణాల్లోని కూడళ్లలో తరచు చర్చావేదికలు నిర్వహిస్తూ వచ్చారు. అక్కడే విధానాలు ఖరారయ్యేవి. ఆ విధానాలే ఇప్పుడు విజయాన్నిచ్చాయి. అయితే వూచిచ్ ఇంత త్వరగా పదవినుంచి తప్పుకుంటారని వారనుకోలేదు. బహుశా ఇదే బెల్‌గ్రేడ్‌లో 1903లో తన పేరేగల రాజుపై సైన్యం తిరుగుబాటుచేసి ఆయన్ని కిటికీ నుంచి విసిరేయడం గుర్తొచ్చి ఉండాలి. సైన్యం బలంతో అధికారానికి అంటిపెట్టుకుంటే కష్టాలు చవిచూడాల్సి వస్తుందని వూచిచ్ సరిగానే అంచనా వేసుకున్నారు. ఇంతకూ ఓడింది బ్రెజిల్‌లో మాదిరే మితవాద, జాతీయవాద పక్షమైనా... నెగ్గిందెవరో చెప్పటం అంత సులభం కాదు. వారు ఉదారవాదులనీ, అమెరికా డీప్ స్టేట్ ఏజెంట్లనీ వూచిచ్ ప్రచారం చేశారు. అటు ట్రంప్‌కు సైతం అలాంటి ఆశ ఉంది. బెల్‌గ్రేడ్‌లో ట్రంప్ టవర్‌కు వూచిచ్ అనుమతించకపోవడం ఆయనకు ఆగ్రహం కలిగించింది. కానీ స్టూడెంట్ లిస్ట్ అంత తేలిగ్గా అమెరికాను అక్కున చేర్చుకునే రకం కాదు. వారు మౌలికంగా ప్రజాస్వామికవాదులు. జాతీయవాదం తమలో ఏం తక్కువలేదని ఉద్యమ సందర్భంలో చాటారు. యూరోప్ యూనియన్(ఈయూ)లో చేరతామంటూనే సెర్బియా రష్యా వైపు మొగ్గడం ఆ సంస్థకు నచ్చలేదు. స్టూడెంట్ లిస్ట్ పార్టీకి ఈయూపై ఆసక్తే లేదు. మొత్తానికి నిలకడగా, సూత్రబద్ధంగా పోరాడి సాధించిన విజయం పాలనలో ఎన్నెన్ని మలుపులు తిరుగుతుందో వేచి చూడాలి.

RNI : APTEL/25/A0108 www.mahinewsindia.com epaper: https://epaper.mahinewsindia.com

## నవంబర్ 1, 2 తేదీల్లో అనంతపురం జిల్లాలో
# కేంద్ర కరువు బృందం పర్యటన

### కరువు పరిస్థితులపై నవంబర్ 2న క్షేత్రస్థాయి పరిశీలన
### అన్ని శాఖలు సమన్వయంతో పక్కాగా ఏర్పాట్లు చేయాలి
### అధికారులకు డీఆర్వో ఏ. మలోల ఆదేశాలు



అనంతపురం, అక్టోబర్ 28: (మహి న్యూస్): అనంతపురం జిల్లాలో నవంబర్ 1, 2 తేదీల్లో పర్యటించనున్న కేంద్ర కరువు బృందం (ఐఎంసీటీ) పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని డీఆర్వో ఏ. మలోల సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని డీఆర్వో ఛాంబర్‌లో



అధికారులతో పర్యటన ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. నవంబర్ 1న కేంద్ర బృందం జిల్లా కేంద్రానికి చేరుకుంటుందని, నవంబర్ 2న జిల్లాలో క్షేత్రస్థాయిలో కరువు పరిస్థితులను పరిశీలిస్తుందని తెలిపారు. కేంద్ర బృందం పర్యటనకు సంబంధించి నిమిషాల వారీ కార్యక్రమాన్ని సిద్ధం చేయాలని, క్షేత్రస్థాయి పరిశీలనకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. పోలీసు శాఖ భద్రతా ఏర్పాట్లు చేయాలని, జిల్లాకు సంబంధించిన పూర్తి వివరాలు సిద్ధం చేయాలని సూచించారు. ఖరీఫ్ 2026--27లో కరువు పరిస్థితులను వివరించేలా ఫొటో ప్రదర్శన ఏర్పాటు చేయాలని తెలిపారు. వ్యవసాయ, ఉద్యాన, పశు సంవర్ధక, ఆర్‌డబ్ల్యూఎస్, ఐసీడీఎస్, పోలీసు తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పర్యటనలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని డీఆర్వో ఆదేశించారు. ఈ సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఆనంద్, వెంకట నారాయణ, జిల్లా వ్యవసాయ అధికారి సాలు రెడ్డి, పశుసంవర్ధక శాఖ జేడీ ప్రేమ్‌చంద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ కె. శ్రీనివాసులు, హెచ్‌ఎల్‌సీ ఎస్‌ఈ సుధాకర్ రావు, ఏపీఎంఐపీ ఏపీడీ చంద్రశేఖర్, డ్వామా, ఐసీడీఎస్, సెరికల్చర్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# శ్రీనివాసరెడ్డిపై పోలీసు, రిజిస్ట్రేషన్ శాఖకు ఫిర్యాదు

### ప్రభుత్వ కార్యాలయంలో విధుల నిర్వహణ, సమయపాలనపై పత్రికలో కథనం
### కార్యాలయంలో వాగ్వాదానికి దిగినట్లు విలేఖరి ఆరోపణ
### ఆరోపణలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని అధికారులకు విజ్ఞప్తి




అనంతపురం, అక్టోబర్ 28: (మహి న్యూస్): స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ రూరల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న శ్రీనివాసరెడ్డిపై ఓ పత్రిక విలేఖరి పోలీసులకు, రిజిస్ట్రేషన్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ప్రభుత్వ ఉద్యోగుల విధుల నిర్వహణ, సమయపాలనపై బుధవారం సదరు పత్రికలో "శ్రీనివాసరెడ్డి ప్రభుత్వ పని వేళలు పాటించరా?" అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. ఈ నేపథ్యంలో కార్యాలయంలో శ్రీనివాసరెడ్డి విలేఖరితో వాగ్వాదానికి దిగినట్లు ఫిర్యాదులో పేర్కొన్నట్లు సమాచారం. ఈ ఘటనతో కార్యాలయంలో ఉన్న అధికారులు, సిబ్బంది, అక్కడికి వచ్చిన ప్రజలు ఆశ్చర్యానికి గురైనట్లు కథనంలో పేర్కొన్నారు. శ్రీనివాసరెడ్డి విధులకు ఆలస్యంగా హాజరవడం, విధులను పూర్తిస్థాయిలో నిర్వహించకపోవడం, ఇతర కార్యాలయాల పరిధిలో తిరగడం, వ్యక్తిగత పనుల్లో నిమగ్నమవడం వంటి ఆరోపణలను పత్రిక కథనంలో ప్రస్తావించారు. గతంలో పనిచేసిన చోట్ల కూడా శాఖా నిబంధనలు, ఉన్నతాధికారుల పట్ల వ్యవహారశైలిపై అభ్యంతరాలు ఉన్నట్లు ఆరోపించారు. ఈ వ్యవహారానికి సంబంధించి ఆధారాలతో స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీకి, స్థానిక పోలీస్ స్టేషన్‌లో విలేఖరి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఫిర్యాదులోని అంశాలను పరిశీలించి, విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరినట్లు పేర్కొన్నారు.



గమనిక: పై కథనంలోని ఆరోపణలు సంబంధిత వ్యక్తిపై చేసిన ఫిర్యాదులో భాగంగా ఉన్నాయి. వాటిపై అధికారిక విచారణ, సంబంధిత శాఖ స్పందన వివరాలు అందుబాటులో లేవు.

# రీ సర్వే సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి

### అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన జాయింట్ కలెక్టర్ సి. విష్ణుచరణ్
### భూ రికార్డుల్లో లోపాలు, పెండింగ్ అంశాలపై ప్రత్యేక దృష్టి
### శాఖల మధ్య సమన్వయంతో రీ సర్వే ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశం



అనంతపురం, అక్టోబర్ 28: (మహి న్యూస్): జిల్లాలో రీ సర్వేకు సంబంధించి కొనసాగుతున్న సమస్యలు, పెండింగ్ అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సి. విష్ణుచరణ్ అధికారులను ఆదేశించారు. బుధవారం అనంతపురం నగరంలోని జాయింట్ కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రీ సర్వే సమస్యలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రీ సర్వే పురోగతి, భూ రికార్డుల్లో ఉన్న లోపాలు, పరిష్కరించాల్సిన పెండింగ్ సమస్యలపై అధికారులతో చర్చించారు. క్షేత్రస్థాయిలో సమస్యలను పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పెండింగ్ అంశాలను త్వరగా పరిష్కరించాలని సూచించారు. భూ రికార్డుల ఖచ్చితత్వాన్ని నిర్ధారిస్తూ, నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం రీ సర్వే ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఏడీ సర్వే, ఎస్‌డీసీ, కేఆర్‌ఆర్‌సీ అధికారులు, సంబంధిత సెక్షన్ అధికారులు పాల్గొన్నారు.

## అనంతపురం జిల్లాలో
# మూడు టీడీపీ జెడ్పీటీసీ స్థానాలు ఏకగ్రీవం

### ఏకగ్రీవంగా ఎన్నికైన ముగ్గురు టీడీపీ అభ్యర్థులు
### అభ్యర్థులకు ఎన్నిక ధ్రువపత్రాలు అందజేసిన రిటర్నింగ్ అధికారి విజయలక్ష్మి




అనంతపురం, అక్టోబర్ 28: (మహి న్యూస్): అనంతపురం జిల్లాలో మూడు జెడ్పీటీసీ స్థానాలు టీడీపీ అభ్యర్థులకు ఏకగ్రీవమయ్యాయని జిల్లా పరిషత్ సీఈవో, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి విజయలక్ష్మి తెలిపారు. బుధవారం స్థానిక జడ్పీ కార్యాలయంలోని సీఈవో ఛాంబర్‌లో ఏకగ్రీవంగా ఎన్నికైన అభ్యర్థులకు ఆమె ఎన్నిక ధ్రువపత్రాలు అందజేశారు.

### ఏకగ్రీవంగా ఎన్నికైన అభ్యర్థుల వివరాలు:

గుంతకల్లు నియోజకవర్గం, గుత్తి మండలానికి చెందిన నల్లబోతుల స్వాతి.
గుంతకల్లు నియోజకవర్గం, పామిడి మండలం, అనంపల్లెకు చెందిన పల్లె శ్రీనివాసులు.
గుంతకల్లు నియోజకవర్గం, గుంతకల్లు మండలం, అమీన్‌పల్లెకు చెందిన డి. గీత.
ఈ ముగ్గురు టీడీపీ అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు విజయలక్ష్మి వెల్లడించారు.

# వైసీపీ ఖేల్ ఖతమ్

- జగన్‌పై ప్రజలకే కాదు.. వైసీపీ శ్రేణులకూ నమ్మకం లేదు
- స్థానిక ఎన్నికల్లో ఓటమి భయంతోనే జగన్‌లో అసహనం
- ప్రజలు, అధికారులను భయపెట్టేలా వ్యాఖ్యలు
- స్థానిక ఎన్నికల్లో కూటమి స్వీప్ చేస్తుంది
- ట్రిపుల్ సర్కార్‌తో అభివృద్ధి, సంక్షేమం పరుగులు



పెనుకొండ, అక్టోబర్ 28: (మహి న్యూస్): రాష్ట్రంలో వైసీపీ పని ఖేల్ ఖతమ్ అయిందని, స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీలు స్వీప్ చేయబోతున్నాయని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత అన్నారు. వైసీపీ అధినేత జగన్‌పై ప్రజలకే కాకుండా ఆ పార్టీ శ్రేణులకు కూడా నమ్మకం లేదని విమర్శించారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. మున్సిపల్, జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో కూటమి పార్టీలు సత్తా చాటాయని మంత్రి సవిత తెలిపారు. 17 మున్సిపాలిటీలు, 77 జెడ్పీటీసీ స్థానాలను కూటమి పార్టీలు ఏకగ్రీవంగా గెలుచుకున్నాయని పేర్కొన్నారు. పులివెందుల నియోజకవర్గంలో ఏడు జెడ్పీటీసీ స్థానాలకు మూడు ఏకగ్రీవం కాగా, 65 ఎంపీటీసీ స్థానాలకు 64 ఏకగ్రీవంగా దక్కాయని వెల్లడించారు. వైసీపీ శ్రేణులు పలు ప్రాంతాల్లో నామినేషన్లు వేయడానికి ముందుకు రాకపోవడం వల్లే ఏకగ్రీవాలు జరిగాయని మంత్రి సవిత ఆరోపించారు. గత ఎన్నికల్లో వైసీపీని 11 సీట్లకు పరిమితం చేసినా జగన్ తీరు మారలేదని విమర్శించారు. ఓటమి భయంతో జగన్ అసహనానికి గురవుతున్నారని, చొక్కా మడత పెడితే అంటూ ప్రజలు, అధికారులను భయపెట్టేలా వ్యాఖ్యలు చేస్తున్నారని మంత్రి ఆరోపించారు. ఆయన మాటలకు వైసీపీ శ్రేణులు రెచ్చిపోతే నష్టపోయేది వారేనని వ్యాఖ్యానించారు. కడపతో పాటు రాయలసీమ వ్యాప్తంగా పెద్ద ఎత్తున పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి సవిత తెలిపారు. కడప, పులివెందుల ప్రాంతాల్లో తాగునీటి ప్రాజెక్టులు చేపడతామని పేర్కొన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వేగవంతం చేస్తామని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నాయకత్వంలో సూపర్ సిక్స్ పథకాల అమలుతో పాటు అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేలా ప్రభుత్వం పనిచేస్తోందని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీలు విజయం సాధిస్తాయని మంత్రి సవిత ధీమా వ్యక్తం చేశారు. జారీ చేసిన వారు: రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి కార్యాలయం

# అనంతపురం నగర, ఎస్కేయూ ప్రాంగణ వృక్షజాలంపై పుస్తకావిష్కరణ

### పుస్తకాన్ని ఆవిష్కరించిన -జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్
### నగరంలో మియావాకి అడవుల ఏర్పాటుకు సాంకేతిక మార్గదర్శకత్వం కోరిన కలెక్టర్
### విద్యార్థులు స్వయం ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలి
### పర్యావరణ పరిరక్షణ, జీవవైవిధ్య అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి



అనంతపురం, అక్టోబర్ 28: (మహి న్యూస్): శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని వృక్షశాస్త్ర విభాగం ప్రొఫెసర్ బి. రవి ప్రసాద్ రావు రచించిన 'ఫ్లోరా ఆఫ్ అనంతపురము సిటీ అండ్ ఎస్కేయూ క్యాంపస్' పుస్తకాన్ని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ ఆవిష్కరించారు. విశ్వవిద్యాలయంలోని వైస్ ఛాన్సలర్ ఛాంబర్‌లో జరిగిన కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎన్.వి.ఆర్. జ్యోతి కుమార్‌తో కలిసి పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రార్ డాక్టర్ ఇ. రమేష్ బాబు కలెక్టర్‌ను సత్కరించారు. అనంతరం కలెక్టర్ విశ్వవిద్యాలయ వృక్షశాస్త్ర ఉద్యానవనాన్ని సందర్శించారు. ఉద్యానవన సంచాలకులు ప్రొఫెసర్ బి. రవి ప్రసాద్ రావు అక్కడి సౌకర్యాలు, థీమ్ గార్డెన్ల ప్రత్యేకతలను వివరించారు. ఉద్యానవనంలో అభివృద్ధి చేసిన మియావాకి అటవీ నమూనాపై కలెక్టర్ ఆసక్తి చూపించారు. అనంతపురం నగరపాలక సంస్థ పరిధిలో ప్రతిపాదించిన మియావాకి అడవుల ఏర్పాటుకు సాంకేతిక మార్గదర్శకత్వం అందించాలని ప్రొఫెసర్‌ను కోరారు. స్థానిక అటవీ, ఔషధ మొక్కల పరిరక్షణతో పాటు జీవవైవిధ్య అభివృద్ధిపై చర్చించారు. సెరికల్చర్ విభాగం కోఆర్డినేటర్ డాక్టర్ బి. సత్యనారాయణతో మాట్లాడి, మల్బరీ సాగులో సేంద్రియ పద్ధతులు, స్థిరమైన పట్టుపురుగుల పెంపకానికి వాటి వల్ల కలిగే ప్రయోజనాలను తెలుసుకున్నారు. విద్యార్థులతో మాట్లాడిన కలెక్టర్ వారి భవిష్యత్ లక్ష్యాలు, వృత్తి ప్రణాళికల గురించి అడిగి తెలుసుకున్నారు. ఉద్యోగాలపైనే ఆధారపడకుండా స్వయం ఉపాధి అవకాశాలను గుర్తించి, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని సూచించారు. ప్రాయోగిక నైపుణ్యాలను పెంపొందించుకొని అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని మార్గనిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రెక్టార్ ప్రొఫెసర్ బి. అనిత, రిజిస్ట్రార్ డాక్టర్ ఇ. రమేష్ బాబు, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మునినారాయణప్ప, ప్రొఫెసర్లు లక్ష్మయ్య, రవీంద్ర, ప్రభాకర్, పీఆర్వో డాక్టర్ బి. సత్యనారాయణ, డాక్టర్ సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

# అగ్రిస్టాక్ రైతుల ఐడీ జనరేషన్, ఈ-కేవైసీ ప్రక్రియ వేగవంతం చేయాలి

### అధికారులకు జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి ఆదేశాలు
### రైతుల ఐడీల నమోదులో పొరపాట్లు లేకుండా సూపర్ చెక్ చేయాలి
### వివిధ శాఖల సమాచారాన్ని అనుసంధానం చేయాలి
### నీటి వనరులు, భూ రికార్డుల వివరాలను నమోదు చేయాలి



కర్నూలు, అక్టోబర్ 28: (మహి న్యూస్): వ్యవసాయ రంగంలో డిజిటల్ సేవలను విస్తృతం చేసి, రైతులకు సేవలను మరింత సులభంగా అందించేందుకు అగ్రిస్టాక్ కింద రైతుల ఐడీ జనరేషన్, ఈ-కేవైసీ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో అగ్రిస్టాక్ అమలుపై వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో జిల్లా స్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతుల ఐడీ జనరేషన్‌తో పాటు ఈ-కేవైసీ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. రైతుల ఐడీల నమోదులో ఎలాంటి పొరపాట్లు జరగకుండా సంబంధిత రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. అగ్రిస్టాక్ అమలును పర్యవేక్షించేందుకు జిల్లా స్థాయిలో టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వ్యవసాయ రంగంలో వాస్తవ సమస్యలను గుర్తించడం, వివిధ శాఖల సమాచారాన్ని అనుసంధానం చేయడం, రైతులకు ఉపయోగపడే పరిష్కారాలను రూపొందించి వాటి అమలును సమీక్షించడం టాస్క్‌ఫోర్స్ ప్రధాన బాధ్యతలని పేర్కొన్నారు. ఫార్మర్



ఐడీ ఆధారంగా భూ రికార్డులు, డిజిటల్ క్రాప్ సర్వే వివరాలు, భూమి యాజమాన్య సమాచారాన్ని ఒకే వేదికపై అందుబాటులోకి తీసుకురావచ్చని తెలిపారు. ఎరువులు, పురుగుమందులు, వ్యవసాయ యంత్రాలకు సంబంధించిన సేవల సమాచారాన్ని కూడా రైతుల అవసరాలకు అనుగుణంగా అనుసంధానం చేయాలని సూచించారు. నీటిపారుదల శాఖ పరిధిలో కాలువల వారీగా వివరాలను సేకరించాలని, డ్రై, వెట్ కేటగిరీల కింద ఉన్న బోర్లు, బావుల స్థితిగతులను నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. నీటి లభ్యత, వినియోగానికి సంబంధించిన వివరాలను సేకరించాలని సూచించారు. పంచాయతీరాజ్, ఉద్యానవన, అటవీ తదితర శాఖల అధికారులు కూడా తమ పరిధిలోని సమాచారాన్ని సేకరించి నమోదు చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, డీఆర్వో సి. వెంకట నారాయణమ్మ, ఇరిగేషన్ ఎస్‌ఈ శైలేశ్వర్, జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, సీపీఓ భారతి, జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి రాజాకృష్ణ రెడ్డి, ఎల్‌డీఎం మోహన్, మార్కెటింగ్ ఏడీ నారాయణమూర్తి, పశుసంవర్ధక శాఖ అధికారి డా. రాజశేఖర్, మత్స్య శాఖ అధికారి రంగనాథ్ బాబు, నేచురల్ ఫార్మింగ్ అధికారి మాధురి తదితరులు పాల్గొన్నారు.

# పిసి-పిఎన్‌డిటి చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి

### నిబంధనలు ఉల్లంఘించే స్కానింగ్ కేంద్రాలపై కఠిన చర్యలు
### నిరంతర నిఘా ఉంచాలని వైద్యాధికారులకు కలెక్టర్ ఆదేశాలు
### కొత్తగా 2 స్కానింగ్ కేంద్రాల రిజిస్ట్రేషన్లకు ఆమోదం

8 కేంద్రాల రెన్యువల్, 7 కేంద్రాల మోడిఫికేషన్లకు అనుమతి

కర్నూలు, అక్టోబర్ 28: (మహి న్యూస్): జిల్లాలో పీసీ అండ్ పీఎన్‌డీటీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి వైద్యాధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో పీసీ అండ్ పీఎన్‌డీటీ చట్టానికి సంబంధించిన జిల్లా స్థాయి మల్టీ మెంబర్ అప్రాప్రియేట్ అథారిటీ కమిటీ సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు.



ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించే స్కానింగ్ కేంద్రాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్కానింగ్ కేంద్రాలపై నిరంతర నిఘా ఉంచడంతో పాటు, గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ నిషేధ చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అనంతరం జిల్లా స్థాయి సలహా కమిటీకి రెండు కొత్త స్కానింగ్ కేంద్రాల రిజిస్ట్రేషన్లు, ఎనిమిది కేంద్రాల రెన్యువల్, ఏడు కేంద్రాల మోడిఫికేషన్ కోసం దరఖాస్తులు అందగా, వాటన్నింటికీ ఆమోదం తెలిపినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో 7వ అదనపు జిల్లా జడ్జి లక్ష్మి రాజ్యం, డీఎంహెచ్‌ఓ డా. కామేశ్వర ప్రసాద్, ఎన్‌జీఓ ప్రతినిధి డా. బాలమద్దయ్య, ఎస్‌ఓ హేమ సుందరం, డెమో ప్రకాశ్, డిప్యూటీ డెమో షఫీ ఉన్నిష తదితరులు పాల్గొన్నారు.

## వర్షాన్ని సైతం లెక్కచేయకుండా 36వ వార్డులో రామ తులసి ఇంటింటి ప్రచారం

### బీరువా గుర్తుపై ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి



మాచర్ల అక్టోబర్ 28:(మహి న్యూస్): పల్నాడు జిల్లా మాచర్ల పట్టణంలోని 36వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి రామ తులసి తన ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, మహిళా కార్యకర్తలు ఉత్సాహంగా ఇంటింటి ప్రచారంలో పాల్గొని, బీరువా గుర్తుపై ఓటు వేసి రామ తులసిని అఖండ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. వినాయకుడి గుట్ట, ఆజాద్ నగర్, ఇందిరమ్మ కాలనీ, వైఎస్సార్ కాలనీలలో గడపగడపకు వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్లను నేరుగా కలిసి తమ ఎన్నికల గుర్తు బీరువాను పరిచయం చేస్తూ, రామ తులసికి మద్దతు తెలిపి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రచార కార్యక్రమంలో బొంగురు, గెల్లిపోగు సామేలు, షేక్ ఖాసిం, పోలేపల్లి ఆనంద్, దాసు, పరిమళ సాయి, బాలయ్య, అబ్బాస్, నాగమణితో పాటు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. ముఖ్యంగా ముస్లిం మైనార్టీ మహిళలు, దళిత మహిళలు సహా వంద మందికి పైగా మహిళలు ప్రచారంలో పాల్గొని ఇంటింటికీ వెళ్లి ఓటర్లను అభ్యర్థించడం విశేషం. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా పార్టీ శ్రేణులు, మహిళా కార్యకర్తలు ప్రచారంలో చురుగ్గా పాల్గొని రామ తులసి విజయమే లక్ష్యంగా ముందుకు సాగారు. 36వ వార్డులో బీరువా గుర్తుకు ఓటు వేసి రామ తులసిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రచారంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు ఓటర్లను కోరారు.

## రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కార్యకర్త కుటుంబానికి రూ10,000 ఆర్థిక సాయం అందించిన యెనుముల కేశవరెడ్డి



మాచర్ల అక్టోబర్ 28:( మహి న్యూస్): మాచర్ల మండలం చెన్నకేశవ కాలనీ 6వ వార్డుకు చెందిన కార్యకర్త జగన్నాథం లక్ష్మయ్య రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం తీవ్ర విషాదాన్ని నింపింది. ఆయన ఆకస్మిక మరణంతో కుటుంబ సభ్యులు తీవ్ర దుఃఖంలో మునిగిపోయారు. ఈ విషాదకర సమయంలో మృతుడి కుటుంబానికి అండగా నిలిచేందుకు యెనుముల కేశవరెడ్డి ముందుకు వచ్చారు. జగన్నాథం లక్ష్మయ్య అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం రూ. 10,000 ఆర్థిక సహాయాన్ని అందించి తన మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు. కష్టకాలంలో బాధిత కుటుంబానికి అండగా నిలిచి, వారి అవసరాలను గుర్తించి ఆర్థిక సహాయం అందించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. సమాజంలో ఒకరికొకరు తోడుగా నిలవడం, ఆపద సమయంలో బాధిత కుటుంబాలను ఆదుకోవడం ఎంతో గొప్ప విషయమని ఈ సందర్భంగా పలువురు అభిప్రాయపడ్డారు. జగన్నాథం లక్ష్మయ్య మృతి పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని భగవంతుడు ప్రసాదించాలని కోరుకుంటున్నాము.

## మున్సిపల్ ఎన్నికల స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాల్లో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

### అధికారులకు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కృతిక శుక్ల ఆదేశాలు
### బ్యాలెట్ బాక్సుల తరలింపునకు స్పష్టమైన ప్రణాళిక సిద్ధం చేయాలి
### వర్షాలు పడినా ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టాలి



పల్నాడు, అక్టోబర్ 28: (మహి న్యూస్): మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా స్ట్రాంగ్ రూమ్‌లు, ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రం, ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కృతిక శుక్ల అధికారులను ఆదేశించారు. బుధవారం మాచెర్లలో మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి ఏర్పాటు చేస్తున్న స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కౌంటింగ్ కేంద్రంలో టేబుళ్ల ఏర్పాటు, బ్యారికేడింగ్ తదితర ఏర్పాట్లను ఎన్నికల నిబంధనల ప్రకారం పూర్తి చేయాలని సూచించారు. ఎన్నికల సామగ్రి పంపిణీ సమయంలో వర్షాలు పడినా ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు సిద్ధం చేసుకోవాలని తెలిపారు. కౌంటింగ్ టేబుళ్ల సంఖ్య, ఓట్ల లెక్కింపు రౌండ్లు, రిసెప్షన్ కేంద్రం





ఏర్పాటు తదితర అంశాలపై అధికారులకు సూచనలు ఇచ్చారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. స్ట్రాంగ్ రూమ్ నుంచి బ్యాలెట్ బాక్సులను కౌంటింగ్ హాళ్లకు తరలించే సమయంలో ఏ పోలింగ్ స్టేషన్‌కు సంబంధించిన బ్యాలెట్ బాక్సులను ఏ కౌంటింగ్ టేబుల్‌కు పంపించాలనే విషయంపై స్పష్టమైన ప్రణాళిక రూపొందించాలని సూచించారు. బ్యాలెట్ బాక్సుల పంపిణీ, తరలింపు ప్రక్రియలో గందరగోళం తలెత్తకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని తెలిపారు. కౌంటింగ్ కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు, సిబ్బందికి వసతులు, ఇతర ఏర్పాట్లన్నింటినీ నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి ఎన్నికల ఓట్ల లెక్కింపునకు సిద్ధంగా ఉంచాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

## మాచెర్లలో పోస్టల్ బ్యాలెట్ కేంద్రాన్ని తనిఖీ చేసిన - కలెక్టర్ కృతిక శుక్ల

### ఎన్నికల విధుల్లో ఉండే ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే అవకాశం
### పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి





పల్నాడు, అక్టోబర్ 28: (మహి న్యూస్): మాచెర్ల మున్సిపాలిటీలోని పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ కృతిక శుక్ల బుధవారం తనిఖీ చేశారు. ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులు, ఉపాధ్యాయుల కోసం ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ రోజున ఎన్నికల విధుల్లో ఉండే సిబ్బంది ముందుగానే పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. డీఐపీఆర్వో, పల్నాడు.




# ప్రాంతాల అభివృద్ధే పట్టం కడుతోంది..!

## అఖండ మెజారిటితో విజయం సాధించాలి.! ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి



మాచర్ల అక్టోబర్ 28:(మహి న్యూస్): కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో విస్తృతంగా కొనసాగుతున్న ప్రాంతాల అభివృద్ధే అభ్యర్థులకు పట్టం కడుతోందని మాచర్ల శాసన సభ్యులు శ్రీ జూలకంటి బ్రహ్మానందరెడ్డి వెల్లడించారు. మున్సిపల్ ఎన్నికలు నేపథ్యంలో



బుధవారం పట్టణంలోని 28,29 వార్డులో ఉదయం పర్యటించి ప్రచారం చేపట్టగా.., సాయంత్రం 24,25 వార్డులో కూటమి అభ్యర్థుల గెలుపుతో పాటు చైర్మన్ అభ్యర్థి యెనుముల సుష్మాకేశవరెడ్డి విజయం కోసం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.., మున్సిపాలిటి పరిధిలో దాదాపు రూ. 260 కోట్లతో తాగునీటి ప్రాజెక్ట్ అమృత్ స్కీం, నూతన సీసీ రోడ్లు, డ్రైనేజీలు, ఇన్నర్ బైపాస్ రోడ్డు పనులు చేపట్టామన్నారు. నియోజకవర్గంలో సంక్షేమం, అభివృద్ధి తప్ప.., ఎక్కడా అరాచకాన్ని క్షమించే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. అలజడులు సృష్టించి, అరాచకంతో స్థానిక సంస్థ ఎన్నికల్లో గెలవాలని సైకోసైన్యం అధ్యక్షుడు జగన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి చేసిన కుట్రలను ఆ పార్టీ నాయకులకు గ్రహించి, తత్వం బోధపడి పోటీ నుంచి తప్పుకున్నారని విమర్శించారు.

### అఖండ మెజారిటితో విజయం సాధించాలి.!

మున్సిపల్ ఎన్నికల్లో కూటమి పార్టీల అభ్యర్థులు అఖండ మెజారిటితో విజయం సాధించాలని ఎమ్మెల్యే జూలకంటి సతీమణి శోభారాణి, తనయులు గౌతమ్ జూలకంటి కోరారు. బుధవారం 13,14,9,10,11,12,4,5 వార్డుల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల తరుపున ప్రచారం చేపట్టారు. వందల కోట్లతో జరుగుతున్న అభివృద్ధిని వివరిస్తూ.., అభ్యర్థులతో పాటు చైర్మన్ అభ్యర్థి సుష్మా కేశవరెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు యాగంటి మల్లికార్జునరావు, రాజబోయిన మధు, గుండాల శ్రీనివాస్ యాదవ్,బృంగా రమణారావు, సాతులూరి కుమార్, కొమెర దుర్గారావు, వజ్రం నాయక్, కొమెర అనంతరాములు, విరేశ్వరరావు,దొడ్డ చందు, చల్లా నాగమణి, కేతావత్ భవాని బాయ్, దాసరి అంజయ్య, జరుగుమల్లి అంకాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

## పవర్‌గ్రిడ్ సబ్‌స్టేషన్, రైతు బజార్ ఏర్పాటుకు స్థల పరిశీలన

### పిడుగురాళ్ల మండలంలోని చిన్న గార్లపాడు, పెద్ద గార్లపాడు గ్రామాల్లో పర్యటన
### మాచెర్ల మున్సిపాలిటీలో రైతు బజార్ ఏర్పాటుకు స్థల పరిశీలన
### అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్న కలెక్టర్ కృతిక శుక్ల



పల్నాడు, అక్టోబర్ 28: (మహి న్యూస్): పల్నాడు జిల్లా కలెక్టర్ కృతిక శు



క్ల బుధవారం పిడుగురాళ్ల మండలంలోని చిన్న గార్లపాడు, పెద్ద గార్లపాడు గ్రామాల్లో పర్యటించి పవర్‌గ్రిడ్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు అవసరమైన స్థలాలను పరిశీలించారు. పవర్‌గ్రిడ్ నిర్మాణానికి సాంకేతికంగా అనువైన ప్రభుత్వ భూములను పరిశీలించిన కలెక్టర్, ప్రతిపాదిత స్థలాల సరిహద్దులు, విస్తీర్ణం వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాచెర్ల మున్సిపాలిటీలో రైతు బజార్ ఏర్పాటు కోసం ప్రతిపాదించిన స్థలాన్ని పరిశీలించారు. ఆయా ప్రాజెక్టులకు అవసరమైన భూముల వివరాలను సమీక్షించారు.



## 'అర్నబ్' బీభత్సం.. అంతర్వేది తీరానికి కొట్టుకొచ్చిన భారీ నౌక



కోనసీమ: ఆంధ్రప్రదేశ్‌లో బీభత్సం సృష్టిస్తున్న 'అర్నబ్' తుపాను దెబ్బకు సముద్రం అల్లకల్లోలంగా మారింది. తుపాను తీరం దాటే సమయంలో ఏర్పడిన తీవ్రమైన అలల తాకిడికి సముద్రంలో ప్రయాణిస్తున్న ఓ భారీ నౌక మార్గం తప్పి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని అంతర్వేది తీరానికి కొట్టుకొచ్చింది. వైజాగ్ పోర్టులో సరుకు అన్‌లోడ్ చేసుకుని కాకినాడ మీదుగా సింగపూర్ వెళుతున్న మార్షల్ ఐలాండ్స్‌కు చెందిన 'సిగ్మా పేరల్' కార్గో నౌక గాలివానలో చిక్కుకుంది. తుపాను తీరం దాటే సమయంలో ఇంజిన్ ఫెయిల్ కావడంతో పాటు తీవ్రమైన సముద్ర ప్రవాహాలు, ఈదురుగాలుల తాకిడికి నౌక అదుపుతప్పి కేజీ బేసిన్ సమీపంలో సుమారు 130 నాటికల్ మైళ్ల దూరం కొట్టుకుపోయి చివరికి అంతర్వేది తీర ప్రాంతానికి చేరింది. తుపాను తీరం దాటే సమయంలో సముద్రంలో జరిగిన ఈ ఘటనతో కోనసీమ తీర ప్రాంతంలో కలకలం రేగింది. సమాచారం అందుకున్న మెరైన్ అధికారులు, పోర్టు అథారిటీ సిబ్బంది వెంటనే అప్రమత్తమై నౌక పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. తుపాను తీవ్రత తగ్గిన తర్వాత నౌకను సురక్షిత ప్రాంతానికి తరలించేందుకు తగిన చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు వెల్లడించారు.

### మత్స్యకారులకు తీవ్ర నష్టం

అర్నబ్ తుపాను మత్స్యకారులకు తీవ్ర నష్టం కలిగించింది. తుపాను తీవ్రతకు ఓడలరేవు తీరంలో మినీ హార్బర్‌లో లంగర్ వేసిన సుమారు 200 బోట్లు ధ్వంసం అయ్యాయి. ఉప్పాడ, నక్కపల్లి గ్రామాలకు చెందిన మత్స్యకారుల పడవలతో పాటు స్థానిక బోట్లు దెబ్బతిన్నాయి. మంగళవారం రాత్రి వీచిన తుపాను గాలికి ఒక దానికి ఒకటి ఢీకొని పడవలు ధ్వంసమైనట్టు స్థానికులు తెలిపారు. తుపానుకు దెబ్బతిన్న బోట్లను వైఎస్సార్‌సీపీ అమలాపురం నియోజకవర్గం ఇంచార్జ్ శ్రీకాంత్ పరిశీలించారు.

## తెలంగాణలో భారీగా ఐఏఎస్‌ల బదిలీ

**హైదరాబాద్: పలువురు సీనియర్ ఐఏఎస్ అధికారులపై వేటు వేసిన ప్రభుత్వం.. తాజాగా కాంట్రవర్సీలు జరిగిన శాఖల నుంచి సీనియర్ ఐఏఎస్ అధికారులను బదిలీ చేసింది. విద్యుత్ శాఖ నుంచి సీనియర్ ఐఏఎస్ అధికారి నవీన్ మిట్టల్ తప్పించిన సర్కార్.. సీనియర్ ఐఏఎస్ అధికారి సభ్యసాచి ఘోష్ నుంచి ట్రైబల్ వెల్ఫర్ శాఖ తొలగించింది. స్పెషల్ సీఎస్ జయష్ రంజన్ నుంచి మున్సిపల్ శాఖలను సర్కార్ తప్పించింది. ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం.. జయేష్ రంజన్‌కు ఈఎఫ్ఎస్ అండ్ టీ శాఖ బాధ్యతలు అప్పగించింది. వికాస్ రాజ్‌కు ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పోస్టింగ్ ఇచ్చింది. నవీన్ మిట్టల్‌కు రెవెన్యూ, ఆర్అండ్ఆర్, ఆర్‌డబ్ల్యూఎస్, ఆర్ఎస్ఏడీ శాఖల బాధ్యతలు అప్పగించింది. శైలజా రామయ్యర్‌కు రెవెన్యూ (ఎండోమెంట్స్) శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా పోస్టింగ్ ఇవ్వగా.. ఎ.వాణీ ప్రసాద్‌కు స్పోర్ట్స్, హెరిటేజ్ తెలంగాణ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించింది. రాహుల్ బొజ్జాకు ట్రైబల్ వెల్ఫేర్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బాధ్యతలు ఇవ్వగా.. ఇలంబార్తి కేకు రవాణా శాఖ కార్యదర్శిగా పోస్టింగ్ ఇచ్చింది. సర్ఫరాజ్ అహ్మద్‌కు హెచ్ఎండీఏ, మెట్రోపాలిటన్ ఏరియా అభివృద్ధి సంస్థల బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది. శృతి ఓజాకు మహిళా, శిశు సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శిగా పోస్టింగ్ ఇచ్చింది. హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ శాఖ డైరెక్టర్‌గా ముషారఫ్ అలీ ఫారూఖీ, డబ్ల్యూసీడీ అండ్ ఎస్సీ శాఖ డైరెక్టర్‌గా డాక్టర్ ఎస్. సంగీత సత్యనారాయణలకు పోస్టింగ్ ఇచ్చిన ప్రభుత్వం.. జితేష్ వి. పాటిల్‌కు టీజీఎస్పీడీసీఎల్ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ బాధ్యతలను అప్పగించింది.**

## ఇందిరమ్మ పాలన అంటే ఎమర్జెన్సీ రోజులా?: కేటీఆర్



హైదరాబాద్: బీఆర్ఎస్ నేతల హౌస్ అరెస్టులపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మూసీ ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లకుండా అడ్డుకున్నారని.. కాంగ్రెస్ కుట్రలను సహించే ప్రసక్తే లేదంటూ ఆయన ట్వీట్ చేశారు. ఇందిరమ్మ పాలన అంటే ఎమర్జెన్సీ రోజులా? అంటూ ప్రశ్నించిన కేటీఆర్.. మూసీలో లక్షన్నర కోట్ల లూటీని ఆపాలంటూ డిమాండ్ చేశారు. రోడ్డున పడ్డ రైతుల కుటుంబాలను ఆదుకోవాలి.. లేదంటే రేవంత్‌కు ప్రజాక్షేత్రంలో గుణపాఠం తప్పదని కేటీఆర్ హెచ్చరించారు. "ఓ వైపు రాష్ట్రంలో కాంగ్రెస్ తెచ్చిన కరువు విలయ తాండవం చేస్తుంటే.. లక్షన్నర కోట్ల లూటిఫికేషన్ కు సీఎం రేవంత్ స్కెచ్ వేయడం సిగ్గుచేటు. లక్షలాది మంది రైతులు కరువులో నిండా మునిగి కన్నీళ్లు పెడుతుంటే సీఎం మాత్రం మూసీలో మూటల వేట సాగిస్తున్నారు. ఎండిపోయిన పంటలకు ఎకరాకు కనీసం 50 వేల పరిహారం ఇవ్వాల్సిన రేవంత్ పూర్తిగా చేతులెత్తేసి అన్నదాతలకు వెన్నుపోటు పొడిచారు" అంటూ కేటీఆర్ దుయ్యబట్టారు. మూసీలో దోపిడీయే తన తొలి ప్రాధాన్యమని చాటిచెబుతున్న సీఎం రేవంత్ తీరు చూసి ఇవాళ 70 లక్షల మంది రైతులు అసహ్యించుకుంటున్నారు. మూసీ లూటిఫికేషన్ ముసుగులో లక్షల కుటుంబాల ఇళ్లు కూల్చి, రియల్ ఎస్టేట్ దందా చేయాలనే రేవంత్ పన్నాగాన్ని అడ్డుకునే వరకూ బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుంది. అప్రజాస్వామికంగా హౌస్ అరెస్ట్ చేసిన సబితా ఇంద్రారెడ్డి గారిని, కార్తీక్ రెడ్డిని ప్రభుత్వం వెంటనే బేషరతుగా విడుదల చేయాలని బీ ఆర్ ఎస్ పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నాం. అలాగే మూసిలో లక్షన్నర కోట్ల లూటీని ఆపి, రోడ్డున పడ్డ రైతుల కుటుంబాలను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం" అని కేటీఆర్ ట్వీట్ చేశారు.

## ఇండియా కూటమి ర్యాలీకి సీజేపీ మద్దతు.. ఇక రచ్చ రచ్చే



న్యూఢిల్లీ: ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నవంబర్ 1న ఢిల్లీలోని రాంలీలా మైదాన్‌లో ఇండియా కూటమి నిర్వహించనున్న ర్యాలీకి కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) మద్దతు ప్రకటించింది. ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై ఆందోళనలు వ్యక్తం చేస్తూ, స్వేచ్ఛగా, న్యాయంగా ఎన్నికలు జరిగేలా ఎన్నికల సంఘం బాధ్యత వహించాలని ఆ ప్రకటనలో కోరింది. జ్ఞానేశ్ కుమార్ స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలను పర్యవేక్షించేందుకు అవసరమైన విశ్వసనీయతను కోల్పోయారని సీజేపీ ఒక ప్రకటనలో పేర్కొంది. ఎన్నికల సంఘం స్వతంత్రత, విశ్వసనీయతను పునరుద్ధరించాలంటే ఆయన రాజీనామా చేయాల్సిందేనని అభిప్రాయపడింది. "ప్రజలు తమ ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలి తప్ప, ప్రభుత్వం తన ఓటర్లను ఎంచుకోవడం కాదు.. ఇదే ప్రజాస్వామ్యానికి ప్రాథమిక సూత్రం" అని సీజేపీ పేర్కొంది. ఎస్ఐఆర్ ప్రక్రియ ఈ సూత్రాన్ని దెబ్బతీసిందని ఆరోపించింది. అర్హులైన ఓటర్ల పేర్లను జాబితాల నుంచి తొలగించే పరిస్థితులు ఏర్పడటంపై ఆందోళన వ్యక్తం చేసింది. ఓటు హక్కును సులభంగా వినియోగించుకునేలా చేయాల్సింది పోయి, ఓటర్లను మినహాయించే ప్రమాదం పెరిగిందని తెలిపింది.

### ప్రజాస్వామ్య దృక్పథాన్ని ప్రస్తావించిన సీజేపీ

రాజ్యాంగ రూపకల్పనలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పాత్రను సీజేపీ గుర్తుచేసుకుంది. కులం, మతం, లింగం, విద్య, ఆర్థిక స్థితితో సంబంధం లేకుండా ప్రతి వయోజన పౌరుడికి సమాన ఓటు హక్కు కల్పించారని పేర్కొంది. రాజ్యాంగ నిర్మాతలు అంబేద్కర్, జవహర్‌లాల్ నెహ్రూ తదితరులు లక్షలాది మంది భారతీయులు అప్పటివరకు ఎన్నికల్లో పాల్గొనకపోయినా ప్రజలపై విశ్వాసం ఉంచారని తెలిపింది. "ప్రతి పౌరుడికి దేశ భవిష్యత్తును నిర్ణయించడంలో సమాన భాగస్వామ్యం ఉన్నప్పుడే ప్రజాస్వామ్యం విజయవంతమవుతుంది" అని పార్టీ పేర్కొంది. పౌరులను ప్రజాస్వామ్యంలోకి మరింతగా తీసుకురావాలి తప్ప, వారిని దూరం చేయకూడదని తెలిపింది. అర్హులైన ప్రతి పౌరుడి ఓటు హక్కును కాపాడటం ఎన్నికల సంఘం బాధ్యత అని స్పష్టం చేసింది. స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికల కోసం పోరాడే సంస్థలకు మద్దతు ఇస్తామని ప్రకటిస్తూ, "జై భీమ్.. జై హింద్" అని పేర్కొంది.

### అక్టోబర్ 30 కార్యక్రమం వేదిక మార్పు

ఇదిలా ఉండగా, జ్ఞానేశ్ కుమార్‌పై నిరసనగా అక్టోబర్ 30న నిర్వహించ తలపెట్టిన కార్యక్రమాన్ని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధికారిక నివాసానికి మార్చినట్లు ఇండియా కూటమి ప్రకటించింది. అశోక హోటల్, రాంలీలా మైదాన్‌లో కార్యక్రమం నిర్వహించేందుకు అనుమతి నిరాకరించారని ప్రతిపక్షాలు ఆరోపించాయి. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం, న్యూఢిల్లీలోని 10, రాజాజీ మార్గ్‌లో మధ్యాహ్నం 3.30 గంటలకు ఈ కార్యక్రమం జరగనుంది. రాంలీలా మైదాన్‌లో ఏర్పాట్లను పోలీసులు అడ్డుకున్నారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఆరోపించారు. అక్టోబర్ 25 నుంచి నవంబర్ 3 వరకు మైదానాన్ని బుక్ చేసుకున్నప్పటికీ, ఏర్పాట్లకు ఆటంకం కలిగించారని అన్నారు. నవంబర్ 1 ర్యాలీలో ఓటరు జాబితాల సవరణ, ఎన్నికల అక్రమాల ఆరోపణలు, "ఓట్ల చోరీ" అంశాలను ప్రతిపక్షాలు ప్రధానంగా ప్రస్తావించనున్నాయి. ఈ కార్యక్రమంలో 21 ప్రతిపక్ష పార్టీలు పాల్గొనాలని ప్రణాళిక రూపొందించినట్లు వేణుగోపాల్ తెలిపారు. సీజేపీ మద్దతుతో ఎన్నికల సంఘం జవాబుదారీతనం, అర్హులైన ఓటర్ల హక్కుల పరిరక్షణపై ప్రతిపక్షాల ప్రచారానికి మరింత బలం చేకూరే అవకాశముంది. ర్యాలీ నిర్వహణ, అనుమతులపై నెలకొన్న వివాదం తదుపరి పరిణామాలు కీలకం కానున్నాయి.

# అర్చరీలో స్వర్ణ, కాంస్య పతకాలతో సత్తా చాటిన తిరుపతి జిల్లా క్రీడాకారుడు

**తిరుమూరు గణేష్ మణిరత్నంను అభినందించిన కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్**

**యువ క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలిచారని ప్రశంస**

**క్రీడాకారుడికి అవసరమైన సహకారం అందిస్తామని వెల్లడి**



తిరుపతి, అక్టోబర్ 28: (మహి న్యూస్): ఆసియా క్రీడల్లో అర్చరీ విభాగంలో స్వర్ణ, కాంస్య పతకాలు సాధించిన తిరుపతి జిల్లా నాయుడుపేటకు చెందిన తిరుమూరు గణేష్ మణిరత్నంను జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ అభినందించారు. అంతర్జాతీయ క్రీడా వేదికపై పతకాలు సాధించడం జిల్లాకు గర్వకారణమని పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో గణేష్ మణిరత్నంను కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు, ఎన్నికల అబ్జర్వర్ ఎం. వరప్రసాద్, జిల్లా రెవెన్యూ అధికారి జి. నరసింహులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్చరీ వంటి క్రీడలో అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించడం క్రీడాకారుడి ప్రతిభ, పట్టుదల, క్రమశిక్షణకు నిదర్శనమన్నారు. స్వర్ణ, కాంస్య పతకాలతో గణేష్ మణిరత్నం యువ క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలిచారని తెలిపారు. క్రీడల్లో రాణించాలంటే నిరంతర సాధన, ఆత్మవిశ్వాసం, లక్ష్యంపై స్పష్టత అవసరమని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని విజయాలు సాధించి దేశానికి, తిరుపతి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహించేందుకు జిల్లా యంత్రాంగం తరఫున అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తామని కలెక్టర్ తెలిపారు.



# వెంకటగిరి మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ కేంద్రాల పరిశీలన

**స్ట్రాంగ్ రూములు, రిసెప్షన్, కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత**

**ఎన్నికల నిబంధనల ప్రకారం ఏర్పాట్లు పూర్తి చేయాలి**

**అధికారులకు జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ ఆదేశాలు**



తిరుపతి, అక్టోబర్ 28: (మహి న్యూస్): వెంకటగిరి మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు అవసరమైన ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. స్ట్రాంగ్ రూములు, రిసెప్షన్ సెంటర్లు, కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. బుధవారం వెంకటగిరిలోని ఏపీఆర్ బాయ్స్ జూనియర్ కళాశాల, విశ్వోదయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు, రిసెప్షన్ సెంటర్లు, కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూములను శ్రీకాళహస్తి ఆర్డీఓ భానుప్రకాష్ రెడ్డితో కలిసి కలెక్టర్ పరిశీలించారు. అక్కడ చేపట్టిన ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా జరిగేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. స్ట్రాంగ్ రూముల వద్ద నిరంతర నిఘా ఉండేలా చూడాలని, భద్రతా ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కౌంటింగ్ కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు విధులు నిర్వహించే అధికారులు, సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ఎన్నికల కమిషన్ నిబంధనలకు అనుగుణంగా అన్ని ఏర్పాట్లు చేపట్టాలని స్పష్టం చేశారు. ఈ పరిశీలనలో డీఎస్పీ శ్రీనివాసరావు, వెంకటగిరి మున్సిపల్ కమిషనర్ న. కిరణ్, తహశీల్దార్ శిరీష, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# మున్సిపల్ ఎన్నికల మైక్రో అబ్జర్వర్ల ర్యాండమైజేషన్ పూర్తి

**ఎన్నికల సాధారణ పరిశీలకులు డా. ఎం. వరప్రసాద్ సమక్షంలో ప్రక్రియ పూర్తి**

**తిరుపతి నగరపాలక సంస్థతో పాటు నాలుగు మున్సిపాలిటీలకు మైక్రో అబ్జర్వర్ల కేటాయింపు**



తిరుపతి, అక్టోబర్ 28: (మహి న్యూస్): తిరుపతి జిల్లాలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను పర్యవేక్షించేందుకు మైక్రో అబ్జర్వర్ల ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో ఎన్నికల సాధారణ పరిశీలకులు డా. ఎం. వరప్రసాద్ సమక్షంలో ఈ ప్రక్రియ నిర్వహించారు. తిరుపతి నగరపాలక సంస్థతో పాటు పుత్తూరు, వెంకటగిరి, నాయుడుపేట, సూళ్లూరుపేట మున్సిపాలిటీలకు మైక్రో అబ్జర్వర్లను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. ఈ కార్యక్రమంలో జేసీ ఆర్. గోవిందరావు, డీఆర్వో జి. నరసింహులు, ఎన్ఐసీ, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

# పుత్తూరు ఎన్నికల ఓట్ల లెక్కింపునకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయాలి

**స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ కేంద్రాల వద్ద నిరంతర నిఘా**

**ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం ఏర్పాట్లు పూర్తి చేయాలి**

**అధికారులకు జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ ఆదేశాలు**



పుత్తూరు/తిరుపతి, అక్టోబర్ 28: (మహి న్యూస్): పుత్తూరు మున్సిపల్ ఎన్నికలతో పాటు జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. బుధవారం పుత్తూరులోని సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్, స్ట్రాంగ్ రూములు, రిసెప్షన్ సెంటర్, కౌంటింగ్ కేంద్రాలను తిరుపతి ఆర్డీఓ రామమోహన్‌తో కలిసి కలెక్టర్ పరిశీలించారు. అక్కడ చేపట్టిన ఏర్పాట్లను సమీక్షించి అధికారులకు సూచనలు చేశారు. ఓట్ల లెక్కింపు పారదర్శకంగా, సజావుగా జరిగేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. స్ట్రాంగ్ రూముల వద్ద నిరంతర నిఘా ఉంచాలని, కౌంటింగ్ కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బందికి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని, సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం లో పుత్తూరు డీఎస్పీ రవికుమార్, మున్సిపల్ కమిషనర్ నాగేశ్వరరావు, పుత్తూరు తహశీల్దార్ వెంకటేశ్వర్, నారాయణవనం తహశీల్దార్ భార్గవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.







# టొబాకో ఫ్రీ యూత్ క్యాంపెయిన్ 4.0 ప్రారంభం

**పొగాకు వినియోగానికి వ్యతిరేకంగా తిరుపతిలో అవగాహన ర్యాలీ**

**యువత పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలి: డీఎంహెచ్‌వో డాక్టర్ బాలకృష్ణ నాయక్**

**11,187 చలానాలు.. రూ.3,96,970 జరిమానా వసూలు**




తిరుపతి, అక్టోబర్ 28: (మహి న్యూస్): యువత పొగాకు వినియోగానికి దూరంగా ఉండాలని, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వి. బాలకృష్ణ నాయక్ సూచించారు. టొబాకో ఫ్రీ యూత్ క్యాంపెయిన్ 4.0 ప్రారంభోత్సవం సందర్భంగా బుధవారం తిరుపతి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పొగాకు వినియోగానికి వ్యతిరేకంగా చేపట్టిన ర్యాలీని డీఎంహెచ్‌వో డాక్టర్ బాలకృష్ణ నాయక్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకు వినియోగం వల్ల క్యాన్సర్, గుండె సంబంధిత వ్యాధులు, శ్వాసకోశ సమస్యలు వంటి తీవ్రమైన అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని తెలిపారు. యువత పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. పొగాకు దుష్పరిణామాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎస్వీ మెడికల్ కళాశాల వద్ద మానవహారం నిర్వహించి, పొగాకు ఉత్పత్తుల వినియోగానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు.

### పొగాకు నియంత్రణలో తిరుపతి జిల్లా పురోగతి

ఈగల్ బృందం సభ్యులు మాట్లాడుతూ సిగరెట్లు, ఇతర పొగాకు ఉత్పత్తుల చట్టం (కోట్పా--2003) అమలులో భాగంగా 2026--27 ఆర్థిక సంవత్సరంలో తిరుపతి జిల్లాలో విస్తృత తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై 11,187 చలానాలు విధించి, రూ.3,96,970 జరిమానా వసూలు చేసినట్లు వెల్లడించారు. చలానాల విధింపు, జరిమానాల వసూళ్లలో రాష్ట్రస్థాయిలో తిరుపతి జిల్లా ప్రథమ స్థానంలో ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అధికారులు, ఎన్‌సీడీ బృందం, డీఎంహెచ్‌వో కార్యాలయ సిబ్బంది, ఈగల్ బృందం సభ్యులు, పద్మావతి నర్సింగ్ కళాశాల విద్యార్థులు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.




# చిత్తూరు జిల్లాలో మూడు జెడ్పీటీసీ స్థానాలు ఏకగ్రీవం

**ఏకగ్రీవంగా ఎన్నికైన సభ్యులకు ధ్రువీకరణ పత్రాలు అందజేత**

**యాదమరి, బంగారుపాళ్యం, పూతలపట్టు జెడ్పీటీసీ స్థానాలు టీడీపీ కైవసం**





చిత్తూరు, అక్టోబర్ 28: (మహి న్యూస్): చిత్తూరు జిల్లాలో మూడు జెడ్పీటీసీ స్థానాలు ఏకగ్రీవం కావడంతో ఎన్నికైన సభ్యులకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్ కుమార్ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. బుధవారం స్థానిక జడ్పీ కార్యాలయంలోని జడ్పీ సీఈఓ ఛాంబర్‌లో ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశారు.



### ఏకగ్రీవంగా ఎన్నికైన జెడ్పీటీసీ సభ్యులు:

యాదమరి జెడ్పీటీసీ - యశోద (టీడీపీ)

బంగారుపాళ్యం జెడ్పీటీసీ - సుచిత్ర జయప్రకాష్ (టీడీపీ)

పూతలపట్టు జెడ్పీటీసీ - శైలజ (టీడీపీ)

# టేకుమంద సెగ్మెంట్లో గల గ్రామాలను మరింత అభివృద్ధి చేస్తా

**ఏకగ్రీవ ఎంపిటిసి కే. జానకిరామయ్య.**





చిత్తూరు జిల్లా/ బంగారుపాలెం మహి న్యూస్ అక్టోబర్ 28.: చిత్తూరు జిల్లా బంగారుపాలెం మండలం టేకు మశీద పంచాయతీ అదే సెగ్మెంట్లో తెలుగుదేశం పార్టీ తరఫున పోటీ చేసిన కే. జానకి రామయ్య అక్కడి తెలుగుదేశం పార్టీ నాయకులు గ్రామస్తులు పెద్దలు సహకారంతో ప్రస్తుతం జరుగుతున్న ఎంపీటీసీ పోటీలలో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ఎంపీటీసీ కె. జానకిరామయ్య పత్రిక ముఖంగా మాట్లాడుతూ, ఐదేళ్లపాటు తమ టేకుమంద సెగ్మెంట్లో ప్రజలకు కావలసిన అవసరాలను బట్టి అన్ని విధాల అభివృద్ధి కార్యక్రమాలను చేపడతానని, సమస్యలు ఏదైనా ఉన్నట్లయితే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మండలంలోని పెద్దల సహకారంతో టేకుమంద సెగ్మెంట్ మరింత అభివృద్ధి చేస్తానని బుధవారం తెలిపారు. తమకు సహకరించిన మండల తెలుగుదేశం పార్టీ గౌరవ అధ్యక్షులు ఎన్ పీ జయప్రకాష్ నాయుడు, అధ్యక్షులు ఎన్ పీ ధరణి నాయుడు, మండల కార్యదర్శి జనార్ధన్ గౌడ్, నాయకులు ఎన్ పి రాధాకృష్ణ,కోకా ప్రకాష్ నాయుడు, కోదండ యాదవ్, జనసేన పార్టీ బాలు, మండల క్లస్టర్ ఇన్చార్జి లకు, గ్రామస్తులు ఎగిడి భాస్కర్, మణి , పరదేశి, గ్రామ పెద్దలకు, యువతకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఎన్నికలపై ఓటర్లకు అవగాహన కల్పించిన ఇన్స్పెక్టర్ కత్తి శ్రీనివాసులు



చిత్తూరు జిల్లా/ బంగారుపాలెం మహి న్యూస్ అక్టోబర్ 28.: చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండలం పరిధిలోని కొన్ని గ్రామాలను సందర్శించి ఎంపీటీసీ ఎలక్షన్ రానున్న సందర్భంగా ఓటర్లకు అవగాహన కార్యక్రమం తన సిబ్బందితో కలిసి ఇన్స్పెక్టర్ కత్తి శ్రీనివాసులు బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొదలమడుగు, వేపనపల్లి, గౌరీ శంకర్ పురం, కీరమంద, ఎగువ రాగిమానుపెంట, దిగువరాగిమాను పెంట, గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించినట్లు ఇన్స్పెక్టర్ కత్తి శ్రీనివాసులు తెలిపారు. పోలింగ్ రోజున ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వీటిపై హెచ్చరికలు జారీ చేశారు,. ఇటువంటి పరిస్థితుల్లో ఘర్షణలు గొడవలు పడరాదని శాంతి భద్రతల విషయంలో పోలీసులకు సహకరించాలని ప్రజలకు అవగాహన కల్పించారు. నేరాలకు పాల్పడితే అటువంటి వారిపై అటువంటి వారిపై రౌడీ షీటర్లు ఓపెన్ చేయడం జరుగుతుందని ఇన్స్పెక్టర్ కత్తి శ్రీనివాసులు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై టీ.ప్రసాద్, ఏఎస్ఐ నరసింహులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు



# నాయుడుపేట, సూళ్లూరుపేటలో ఎన్నికల ఏర్పాట్ల పరిశీలన

**స్ట్రాంగ్ రూమ్‌లు, డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను పరిశీలించిన - జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు**

**వ్యయ పరిశీలకులతో కలిసి ఏర్పాట్ల తనిఖీ**



తిరుపతి, అక్టోబర్ 28: (మహి న్యూస్): మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో నాయుడుపేట, సూళ్లూరుపేటలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లు, డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు బుధవారం పరిశీలించారు. సూళ్లూరుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల, నాయుడుపేట జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లు, ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాలను వ్యయ పరిశీలకులతో కలిసి తనిఖీ చేశారు.





# స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు పక్కా ప్రణాళికతో పనిచేయాలి

**స్ట్రాంగ్ రూమ్‌లను క్షేత్రస్థాయిలో పరిశీలించాలి**

**పోలింగ్ సిబ్బంది కేటాయింపు నుంచి ఎన్నికల సామగ్రి పంపిణీ వరకు సమన్వయంతో వ్యవహరించాలి**

**సమయపాలన, పారదర్శకతతో ఎన్నికల విధులు నిర్వహించాలి**

**అధికారులకు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ సూచనలు**



చిత్తూరు, అక్టోబర్ 28: (మహి న్యూస్): స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, ముందస్తు ప్రణాళికతో ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్ కుమార్ సూచించారు. బుధవారం చిత్తూరులోని జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న సూపర్వైజర్లతో ఎన్నికల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, డీఆర్ఓ కే. మోహన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. పోలింగ్ సిబ్బంది సమయానికి హాజరయ్యేలా ముందస్తు సమాచారం అందించాలని కలెక్టర్ ఆదేశించారు. పోలింగ్ అధికారులు, సహాయ పోలింగ్ అధికారులు, ఇతర సిబ్బంది ఉదయం 7.30 నుంచి 8 గంటలలోపు డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలకు చేరుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. విధులకు గైర్హాజరయ్యే సిబ్బందిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని, అవసరమైనప్పుడు రిజర్వ్ సిబ్బందిని వినియోగించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు సిద్ధంగా ఉంచాలని సూచించారు. స్ట్రాంగ్ రూమ్‌లలో బ్యాలెట్ బాక్సులను భద్రపరిచే సమయంలో గందరగోళం తలెత్తకుండా ప్రాదేశిక నియోజకవర్గాలు, పోలింగ్ కేంద్రాల వారీగా నేలపై స్పష్టమైన గుర్తులు వేయాలన్నారు. స్ట్రాంగ్ రూమ్‌ల వెలుపల సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, వీడియో రికార్డింగ్‌లను భద్రంగా భద్రపరచాలని ఆదేశించారు. ఎన్నికల సామగ్రి పంపిణీ సమయంలో ప్రత్యేక, సాధారణ కౌంటర్ల నిర్వహణపై దృష్టి సారించాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ సూచించారు. బ్యాలెట్ పేపర్లు, పేపర్ సీల్స్, ఇతర ఎన్నికల సామగ్రిని సంబంధిత సిబ్బందికి సక్రమంగా అందజేసి, స్వీకరణకు సంతకాలు తీసుకోవాలన్నారు. బ్యాలెట్ బాక్సులను పంపిణీకి ముందు పరిశీలించి, ప్రతి పోలింగ్ కేంద్రానికి అవసరమైన సామగ్రిని సరిచూసి అందజేయాలని తెలిపారు. ఎన్నికల సామగ్రి పంపిణీ, సిబ్బంది తరలింపు ప్రక్రియలను అక్టోబర్ 31వ తేదీ మధ్యాహ్నం 12 గంటలలోపు పూర్తి చేయాలని డీఆర్ఓ సూచించారు. పోలింగ్ సిబ్బంది అదే రోజు మధ్యాహ్నం 3 గంటలలోపు తమకు కేటాయించిన కేంద్రాలకు చేరుకునేలా రవాణా ఏర్పాట్లు సమన్వయం చేయాలన్నారు. రిసెప్షన్ కేంద్రాల్లో సిబ్బంది హాజరు, సామగ్రి స్వీకరణ, వాహనాల కేటాయింపు, రూట్ అధికారుల సమన్వయాన్ని నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. అక్టోబర్ 30, 31 తేదీలతో పాటు నవంబర్ 1న మున్సిపల్ ఎన్నికల విధులను పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ప్రతి అధికారి తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ, ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేలా అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో నగరి ఆర్డీవో అనుపమ, పలమనేరు ఆర్డీవో భవాని, చిత్తూరు ఆర్డీవో శ్రీనివాసులు నాయుడు, చిత్తూరు మున్సిపల్ కమిషనర్ నరసింహ ప్రసాద్, కుప్పం ఆర్డీవో తదితరులు పాల్గొన్నారు.



## కర్నూలు నగరపాలక సంస్థ ఎన్నికలకు ఏర్పాట్లు ముమ్మరం

### ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రం పనులు తుది దశకు
### ఓట్ల లెక్కింపు కోసం 145 టేబుళ్ల ఏర్పాటు
### ఎన్నికల విధుల్లో పాల్గొనే 820 మంది సిబ్బందికి శిక్షణ



కర్నూలు, అక్టోబర్ 28: (మహి న్యూస్): కర్నూలు నగరపాలక సంస్థ ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను ముమ్మరం చేసినట్లు అడిషనల్ ఎలక్షన్ అథారిటీ, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. బుధవారం నగర శివార్లలోని అథెనా స్కూల్ ప్రాంగణంలో ఏర్పాటు చేస్తున్న ఎన్నికల సామగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రం, ఓట్ల లెక్కింపు హాల్, బ్యాలెట్ బాక్సుల భద్రత కోసం ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లను ఆయన పరిశీలించారు. నవంబర్ 1న జరగనున్న పోలింగ్‌కు సంబంధించి ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రం పనులు తుది దశకు చేరుకున్నాయని కమిషనర్ తెలిపారు. ఎన్నికల సిబ్బందికి అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నామని, సామగ్రి పంపిణీ, స్వీకరణ సమయంలో ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేసి నిర్దేశిత సమయానికి ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రం నుంచి వాహనాలు సులభంగా బయటకు వెళ్లేందుకు ప్రత్యేక రహదారిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మేయర్, కార్పొరేటర్ అభ్యర్థుల ఓట్ల లెక్కింపు కోసం 145 టేబుళ్లు ఏర్పాటు చేస్తున్నామని, ఎన్నికల విధుల్లో పాల్గొనే 820 మంది సిబ్బందికి శిక్షణ ఇచ్చినట్లు వెల్లడించారు. బ్యాలెట్ బాక్సులను భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌లలో నిఘా కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలింగ్‌తో పాటు ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా జరిగేలా అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేస్తున్నట్లు కమిషనర్ చల్లా ఓబులేసు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈ మనోహర్ రెడ్డి, డీఈఈలు పవన్ కుమార్ రెడ్డి, నరేష్, శ్రీనివాసన్, ఏఈలు జనార్ధన్, ప్రవీణ్ కుమార్ రెడ్డి, రాంమోహన్ తదితరులు పాల్గొన్నారు.








## ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వహించాలి

### క్షేత్రస్థాయి తనిఖీలు ముమ్మరం చేయాలి
### అభ్యర్థుల ఎన్నికల వ్యయంపై నిరంతర పర్యవేక్షణ
### జోనల్ అధికారులకు కమిషనర్ చల్లా ఓబులేసు ఆదేశాలు



కర్నూలు, అక్టోబర్ 28: (మహి న్యూస్): కర్నూలు నగరపాలక సంస్థ ఎన్నికల పోలింగ్ సమయం సమీపిస్తున్న నేపథ్యంలో జోనల్ అధికారులు మరింత చురుగ్గా పనిచేయాలని అడిషనల్ ఎలక్షన్ అథారిటీ, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు ఆదేశించారు. బుధవారం ఎస్‌బీఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో జోనల్ అధికారులతో సమావేశం నిర్వహించి ఎన్నికల విధులపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జోనల్ అధికారులకు కేటాయించిన వార్డుల్లో క్షేత్రస్థాయి తనిఖీలు ముమ్మరం చేయాలని సూచించారు. అభ్యర్థుల ఎన్నికల వ్యయాన్ని నిరంతరం పర్యవేక్షించాలని, ఎన్నికల నియమావళి అమలును పరిశీలించాలని ఆదేశించారు. సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా జరిగేలా చూడటంలో జోనల్ అధికారుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. అనంతరం బ్యాలెట్ బాక్సుల నిర్వహణపై ప్రాయోగిక ప్రదర్శన నిర్వహించి అధికారులకు అవగాహన కల్పించారు. ఎన్నికల విధుల్లో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిబంధనలను పాటిస్తూ బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు.



## మున్సిపల్ ఎన్నికల్లో ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా
## ఓటు హక్కు వినియోగించుకోవాలి

### ఫారం 10ఏతో పాటు డ్యూటీ ఆర్డర్, గుర్తింపు కార్డు సమర్పించాలి
### నిబంధనల ప్రకారం బ్యాలెట్ పత్రాలు, కవర్లు సమర్పించాలి
### పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



నంద్యాల, అక్టోబర్ 28: (మహి న్యూస్): మున్సిపల్ ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సూచించారు. బుధవారం నంద్యాల మున్సిపల్ కార్యాలయంలో కొనసాగుతున్న పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేయాలనుకునే ఉద్యోగులు ఫారం 10ఏతో పాటు డ్యూటీ ఆర్డర్, గుర్తింపు కార్డు సమర్పించాలని తెలిపారు. బ్యాలెట్ పత్రాన్ని నిర్దేశించిన చిన్న కవరులో ఉంచి, ధ్రువీకరణ ఫారాన్ని బయట ఉంచి, ఈ రెండింటినీ పెద్ద కవరులో పెట్టి సమర్పించాలని సూచించారు. నిబంధనల ప్రకారం కవర్లను సక్రమంగా సమర్పించినప్పుడే పోస్టల్ బ్యాలెట్ ఓట్లు లెక్కింపునకు పరిగణనలోకి వస్తాయని పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరగనున్న నేపథ్యంలో, ప్రతి ఓటరు ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వామై తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు.





## బాలికలూ.. చట్టాలపై అవగాహన పెంచుకోండి!

### ఆపదలో భయపడొద్దు.. అండగా సఖి వన్‌స్టాప్ సెంటర్
### బాలికలకు న్యాయవాది డి. శిల్ప పిలుపు



కర్నూలు, అక్టోబర్ 28: (మహి న్యూస్): బాలికలు తమ హక్కులు, చట్టాలపై అవగాహన పెంచుకొని, ఆపద సమయంలో భయపడకుండా ధైర్యంగా సమస్యలను ఎదుర్కోవాలని సఖి వన్‌స్టాప్ సెంటర్ న్యాయవాది డి. శిల్ప పిలుపునిచ్చారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారిణి పి. విజయ ఆదేశాల మేరకు ఏ. క్యాంపులోని కార్పొరేషన్ హైస్కూల్‌లో 9వ తరగతి బాలికలకు సఖి వన్‌స్టాప్ సెంటర్ ఆధ్వర్యంలో లీగల్ అవేర్‌నెస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాది డి. శిల్ప మాట్లాడుతూ.. బాలికల రక్షణకు చట్టాలు అండగా ఉన్నాయని, వాటిపై అవగాహన కలిగి ఉండటం ఎంతో అవసరమని తెలిపారు. పోక్సో చట్టం--2012, బాల్య వివాహాల నిషేధ చట్టం--2006 నిబంధనలు, నేరాలకు విధించే శిక్షలు, జరిమానాల గురించి వివరించారు. సఖి వన్‌స్టాప్ సెంటర్ ద్వారా అందించే ఐదు రకాల సేవలను తెలియజేశారు. ఆపదలో ఉన్న బాలికలు, మహిళలు సమస్యలను చూసి కుంగిపోకుండా ధైర్యంగా ముందుకు రావాలని సూచించారు. సమస్యల పరిష్కారానికి మార్గాలను అన్వేషించాలని, ఆత్మహత్య వంటి అఘాయిత్యాలకు పాల్పడవద్దని కోరారు. అవసరమైనప్పుడు 1098 లేదా 181 హెల్ప్‌లైన్ నంబర్లను సంప్రదించి సహాయం పొందాలని, సఖి వన్‌స్టాప్ సెంటర్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డి. రోజా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఓట్ల లెక్కింపుపై అధికారులకు శిక్షణ

### రాష్ట్ర ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం కౌంటింగ్ నిర్వహించాలి
### బ్యాలెట్ పేపర్ల వర్గీకరణ, ఫలితాల నమోదు పక్కాగా చేపట్టాలి
### ఎన్నికల నిబంధనల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలి

కర్నూలు, అక్టోబర్ 28: (మహి న్యూస్): స్థానిక సంస్థల ఎన్నికలు--2026లో భాగంగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను రాష్ట్ర ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం పకడ్బందీగా నిర్వహించాలని శిక్షణ నోడల్ అధికారి, డ్వామా పీడీ నరసింహారెడ్డి సూచించారు. బుధవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు ఓట్ల లెక్కింపు నిర్వహణపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహారెడ్డి మాట్లాడుతూ బ్యాలెట్ పేపర్ల వర్గీకరణ, బండిలింగ్, కౌంటింగ్ టేబుళ్ల కేటాయింపు, రౌండ్ల వారీగా ఓట్ల లెక్కింపు, ఫలితాల నమోదు తదితర అంశాలపై అధికారులకు అవగాహన కల్పించారు. చెల్లిన ఓట్లు, చెల్లని ఓట్లు, నోటా ఓట్ల వివరాలను నిర్దేశిత ఫార్మాట్లలో నమోదు చేయాలని సూచించారు. స్ట్రాంగ్ రూమ్ నుంచి బ్యాలెట్ బాక్సులను కౌంటింగ్ హాల్‌కు తరలించే సమయంలో జాగ్రత్తలు పాటించాలని, లెక్కింపు పూర్తయిన తర్వాత తుది ఫలితాలను సరిచూసి రికార్డులను సిద్ధం చేయాలని తెలిపారు. జిల్లా పరిషత్ సీఈవో సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు, టేబుళ్ల కేటాయింపు, ఎంపీటీసీల వారీగా ఓట్ల వివరాల నమోదు, రికార్డుల నిర్వహణను నిబంధనల ప్రకారం చేపట్టాలని సూచించారు. కౌంటింగ్‌కు అవసరమైన ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.







### ఎన్నికల నిబంధనల అమలుపై ప్రత్యేక దృష్టి



ఎంసీసీ నోడల్ అధికారి భాస్కర్ నాయుడు ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై అవగాహన కల్పించారు. వాహనాల అనుమతులు, నగదు, ఇతర వస్తువుల తనిఖీలు, ఫిర్యాదుల పరిష్కారాన్ని నిబంధనల ప్రకారం చేపట్టాలని సూచించారు. ఎఫ్ఎస్టీ (ఫ్లయింగ్), ఎస్ఎస్టీ (స్టాటిక్) బృందాలు నిరంతరం తనిఖీలు నిర్వహించాలని, స్వాధీనం చేసుకున్న నగదు, వస్తువులను నిర్దేశిత విధానంలో భద్రపరచాలని తెలిపారు. తనిఖీల సమయంలో వీడియో గ్రాఫర్లను నియమించి, స్టాటిస్టికల్ సర్వైలెన్స్ పాయింట్ల వద్ద వాహనాల తనిఖీలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

## పోలీసు అమరవీరుల త్యాగాలను ప్రజలకు తెలియజేయాలి

### పోలీసు సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత
### ఉచిత మెగా వైద్య శిబిరం, మెగా రక్తదాన శిబిరం ప్రారంభం
### 260 మంది పోలీసు సిబ్బంది, కుటుంబ సభ్యులకు వైద్య పరీక్షలు
### 55 మందికి పైగా రక్తదానం



కర్నూలు, అక్టోబర్ 28: (మహి న్యూస్): పోలీసు సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నామని, ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ సూచించారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల సందర్భంగా బుధవారం కర్నూలు జిల్లా పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరం, మెగా రక్తదాన శిబిరాలను ఎస్పీ ప్రారంభించారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో మెడికవర్, ఒమేగా హాస్పిటల్స్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించగా, వ్యాస్ ఆడిటోరియం ఎదురుగా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్) ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఆరోగ్య సమస్యలను ప్రాథమిక దశలోనే గుర్తించి, సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. పోలీసు అధికారులు, సిబ్బంది ఆరోగ్యంగా ఉంటేనే విధులను సమర్థవంతంగా నిర్వహించగలరని తెలిపారు. పోలీసు అమరవీరుల త్యాగాలను, సేవలను ప్రజలకు, సమాజానికి తెలియజేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. వైద్య శిబిరంలో మెడికవర్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో 195 మంది, ఒమేగా హాస్పిటల్స్ ఆధ్వర్యంలో 65 మంది కలిపి మొత్తం 260 మంది పోలీసు సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అర్చన డెంటల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో దంత పరీక్షలు, కర్నూలు గాయత్రి ఎస్టేట్‌లోని శాంతిరాం ఐ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించి వైద్య సూచనలు అందించారు. మెడికవర్ తరఫున డాక్టర్ వినోద్ ఆచారి (పల్మనాలజిస్ట్), డాక్టర్ నిఖిల (గైనకాలజిస్ట్), డాక్టర్ మంజునాథ్ (ఆర్థోపెడిక్), ఒమేగా హాస్పిటల్స్ తరఫున డాక్టర్ స్వాతి వైద్య సేవలు అందించారు. మెగా రక్తదాన శిబిరంలో 55 మందికి పైగా రక్తదానం చేశారు. సేకరించిన రక్తాన్ని ప్రభుత్వ ఆసుపత్రి బ్లడ్ బ్యాంకుకు అందజేశారు. జీజీహెచ్ వైద్యులు డాక్టర్ రవికాంత్, డాక్టర్ షేహనాజ్ పాల్గొన్నారు. రక్తదానం చేసేందుకు ముందుకు వచ్చిన పోలీసు సిబ్బంది, యువతను అధికారులు అభినందించారు. వైద్య శిబిరాల నిర్వహణకు సహకరించిన మెడికవర్, ఒమేగా హాస్పిటల్స్ వైద్య బృందాలను ఎస్పీ అభినందించారు. పోలీసు సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు ఈ ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు హుస్సేన్ పీరా, కృష్ణమోహన్, హోంగార్డు డీఎస్పీ ప్రసాద్, పోలీసు వెల్ఫేర్ హాస్పిటల్ వైద్యురాలు డాక్టర్ స్రవంతి, వివిధ ఆసుపత్రుల వైద్యులు, వైద్య సిబ్బంది, సీఐలు, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయం, కర్నూలు.







## నంద్యాల జిల్లాను ఉపాధి హామీ పథకం అమలులో ముందంజలో నిలపాలి

### కూలీల హాజరు పెంచి ప్రతి అర్హ కుటుంబానికి ఉపాధి కల్పించాలి
### పంచాయతీ వారీగా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలి
### అధికారులతో సమన్వయంపై జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా సూచనలు




నంద్యాల, అక్టోబర్ 28: (మహి న్యూస్): నంద్యాల జిల్లాలో ఉపాధి హామీ పథకం అమలును వేగవంతం చేసి, కూలీలకు గరిష్ఠంగా పనిదినాలు కల్పించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో వికసిత్ భారత్ -- గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవిక మిషన్ గ్రామీణ్ (వీబీ-జీ రామ్ జీ) కార్యక్రమంలో భాగంగా వేతనాలు, మెటీరియల్ వ్యయాలపై నిర్వహించిన జిల్లా స్థాయి సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతి కుటుంబానికి నిబంధనల ప్రకారం కనీసం 100 రోజుల పని కల్పించేలా చర్యలు తీసుకోవాలని, ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. జిల్లాలోని 28 మండలాల్లో 27 మండలాలను కరువు ప్రభావిత ప్రాంతాలుగా ప్రకటించినప్పటికీ కూలీల హాజరు ఆశించిన స్థాయిలో లేదని పేర్కొంటూ, హాజరు శాతం పెంచాలని ఆదేశించారు. రోజువారీ కూలి రూ.307 నుంచి రూ.312కు పెరిగిన నేపథ్యంలో ఉపాధి అవకాశాలపై కూలీలకు అవగాహన కల్పించాలని తెలిపారు. టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు క్షేత్రస్థాయిలో పర్యటించి కూలీలను ప్రోత్సహించాలని, పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. గ్రామ సచివాలయాల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, ఇంటింటికీ వెళ్లి ఉపాధి పనుల ప్రాముఖ్యతను వివరించాలని తెలిపారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అదనపు కమిషనర్ ఎం. శివప్రసాద్ మాట్లాడుతూ ప్రతి పంచాయతీకి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, అర్హులైన కుటుంబాలకు ఉపాధి కల్పించాలని సూచించారు. గత ఏడాది జిల్లాలో సుమారు 76 శాతం ప్రగతి సాధించి 1.65 లక్షల కుటుంబాలకు ఉపాధి కల్పించినట్లు తెలిపారు. ప్రస్తుత ఏడాదిలో ఇప్పటివరకు సుమారు 1.30 లక్షల కుటుంబాలకు మాత్రమే ఉపాధి కల్పించగా, మరో 35 వేల కుటుంబాలకు ఉపాధి కల్పించాల్సి ఉందని వివరించారు. గత ఏడాది సాధించిన ప్రగతిని ఆధారంగా చేసుకుని, సవరించిన పనిదినాల లక్ష్యాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించాలని అన్నారు. కరువు, వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అదనపు ఉపాధి అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు. కొన్ని మండలాల్లో రోజువారీ వేతనాలు రూ.242 నుంచి రూ.312 మధ్య నమోదవుతున్నందున, తక్కువ వేతనాలు వస్తున్న ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఈ సమావేశంలో డ్వామా పీడీ సూర్యనారాయణ, ఏపీడీలు, ఏపీవోలు, జేఈలు, ఈసీలు, టీఏలు, బీఎఫ్‌టీలతో పాటు పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.





## హెచ్ఐవీ నియంత్రణలో మొదటి రెండు లక్ష్యాలను 100 శాతానికి చేర్చాలి

### హెచ్ఐవీ పరీక్షలు, చికిత్సపై ప్రత్యేక దృష్టి సారించాలి
### ఏఆర్‌టీ చికిత్సకు దూరమైన వారిని తిరిగి అనుసంధానించాలి
### వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు కలెక్టర్ రాజకుమారి గణియా ఆదేశాలు

నంద్యాల, అక్టోబర్ 28: (మహి న్యూస్): నంద్యాల జిల్లాలో హెచ్ఐవీ నియంత్రణకు నిర్దేశించిన 95-95-95 లక్ష్యాల సాధనకు పటిష్ట కార్యాచరణ అమలు చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ ఛాంబర్‌లో ఎయిడ్స్ సురక్ష కార్యక్రమం అమలు, హెచ్ఐవీ నియంత్రణ లక్ష్యాల సాధనపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. హెచ్ఐవీ నియంత్రణలో మొదటి రెండు లక్ష్యాలను 100 శాతానికి చేర్చేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. మొదటి లక్ష్యంలో భాగంగా హెచ్ఐవీతో జీవిస్తున్న వారిలో కనీసం 95 శాతం మంది తమ హెచ్ఐవీ స్థితిని తెలుసుకునేలా విస్తృతంగా పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. మొబైల్ ఐసీటీసీ వాహనాలను సమర్థవంతంగా వినియోగించి, హెచ్ఐవీ ముప్పు ఎక్కువగా ఉన్న వర్గాలకు పరీక్షలు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. రెండో లక్ష్యంలో భాగంగా హెచ్ఐవీతో జీవిస్తున్న వారిలో కనీసం 95 శాతం మందిని ఏఆర్‌టీ కేంద్రాలకు అనుసంధానించి, వైద్యుల సూచనల మేరకు క్రమం తప్పకుండా మందులు వినియోగించేలా చూడాలని పేర్కొన్నారు. కొత్తగా హెచ్ఐవీ పాజిటివ్‌గా నిర్ధారణ అయిన వారికి వెంటనే చికిత్స అందించాలని, చికిత్సకు దూరమైన వారిని గుర్తించి తిరిగి వైద్య సేవలు పొందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి నెలా ఫోన్ ద్వారా సంప్రదించి చికిత్స కొనసాగింపును పర్యవేక్షించాలని తెలిపారు. హెచ్ఐవీ బాధితుల జీవిత భాగస్వాములు, పిల్లలు, తల్లిదండ్రులు తదితరులకు అవసరమైన పరీక్షలు, కౌన్సెలింగ్ అందించాలని కలెక్టర్ ఆదేశించారు. లక్ష్యాల సాధనలో వెనుకబడిన అంశాలను గుర్తించి, గత ఏడాది గణాంకాలు, ఇతర జిల్లాలు, రాష్ట్రస్థాయి గణాంకాలను విశ్లేషించి కార్యాచరణ రూపొందించాలని సూచించారు. సమావేశంలో ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌వో డా. శారదాబాయి, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ క్లస్టర్ ప్రోగ్రామ్ మేనేజర్ అలీ హైదర్ తదితరులు పాల్గొన్నారు.



RNI : APTEL/25/A0108
www.mahinewsindia.com
మహి న్యూస్
తెలుగు దినపత్రిక
epaper: https://epaper.mahinewsindia.com


# జమ్మలమడుగులో కూటమి అభ్యర్థుల విస్తృత ప్రచారం

### 19, 20, 21వ వార్డుల్లో ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలిసిన టీడీపీ నాయకులు





కడప జిల్లా/జమ్మలమడుగు, మహి న్యూస్ అక్టోబర్ 28: జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని 19, 20, 21వ వార్డుల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా తెలుగుదేశం పార్టీ నాయకులు విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో కడప జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి, జమ్మలమడుగు మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి చదిపిరాళ్ల జ్యోతి, మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి, భూపేష్ రెడ్డి సోదరి ప్రశాంతి పాల్గొని ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలిశారు. ఈ సందర్భంగా ఆయా వార్డుల అభ్యర్థులు బొందలకుంట శివకుమార్, ఆవుల వసుధ, కౌన్సిలర్ అభ్యర్థి ఇండ్ల లక్ష్మీనారాయణ బాబుతో కలిసి నాయకులు ప్రచారం చేపట్టారు. కూటమి అభ్యర్థులకు మద్దతు తెలిపి విజయానికి సహకరించాలని ఓటర్లను కోరారు. ప్రచారంలో భాగంగా స్థానిక ప్రజలతో మమేకమవుతూ ఎన్నికల్లో తమ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకురాలు పాలెం రామసుబ్బమ్మ, సీనియర్ నాయకుడు జంబాపురం రమణారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి బిర్రు సంతోష్‌తో పాటు ఎన్‌డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# మున్సిపల్ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు..!

### కడపలో డిస్ట్రిబ్యూషన్, స్ట్రాంగ్ రూములు, ఓట్ల లెక్కింపు కేంద్రాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్, ఎస్పీ



కడప, మహి న్యూస్ అక్టోబరు 28: కడప నగరపాలక సంస్థ ఎన్నికల నిర్వహణలో భాగంగా డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూములు, ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో పకడ్బంది ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. బుధవారం జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, తదితర అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ కడప ఆర్ట్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్, స్ట్రాంగ్ రూములను అలాగే మౌలానా ఆజాద్ ఉర్దూ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఓట్ల లెక్కింపు కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా స్ట్రాంగ్ రూముల వద్ద భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాల పర్యవేక్షణ, విద్యుత్ సౌకర్యం, ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో మౌలిక వసతులు, అధికారుల రాకపోకలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థులు, ఏజెంట్లకు అవసరమైన సౌకర్యాలపై సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఓట్ల లెక్కింపు సమయంలో ఎలాంటి అసౌకర్యాలు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. ఎన్నికల నిర్వహణలో ఓట్ల లెక్కింపు అత్యంత కీలకమైన దశ అని, ఈ ప్రక్రియలో ప్రతి అంశాన్ని ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా, పూర్తి అప్రమత్తతతో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. భద్రతా చర్యల్లో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని, ఎన్నికల సామగ్రి భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కడప ఆర్డీవో మురళి, కడప నగరపాలక సంస్థ కమిషనర్ డా. పి. భవానీ ప్రసాద్, డీఎస్పీ టి. భవానీ సంబంధిత ఎన్నికల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.







# స్థానిక సంస్థల ఎన్నికలకు పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు..!

### మైదుకూరు మున్సిపల్ కార్యాలయంలో స్ట్రాంగ్ రూములు, ఓట్ల లెక్కింపు కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ



కడప, మహి న్యూస్ అక్టోబరు 28: జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి స్ట్రాంగ్ రూములు, ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో పకడ్బంది ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్‌తో కలిసి మైదుకూరు మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములు, ఓట్ల లెక్కింపు కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. అక్కడ చేపట్టిన భద్రతా ఏర్పాట్లు, కేంద్రాల్లో అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలను సమీక్షించి, స్థానిక ఎన్నికల రిటర్నింగ్ అధికారి, సంబంధిత అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికల ప్రక్రియలో కీలకమైన ఓట్ల లెక్కింపును ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా పూర్తి పారదర్శకతతో నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. స్ట్రాంగ్ రూముల వద్ద నిరంతర భద్రతా పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల నిర్వహణలో విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ, ఓట్ల లెక్కింపు ప్రక్రియను ప్రశాంతంగా, సజావుగా పూర్తి చేసేలా అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో బద్వేలు ఆర్డీవో చంద్రమోహన్, మైదుకూరు మున్సిపల్ కమిషనర్ రంగస్వామి, ఆదిశేషారెడ్డి సంబందిత ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.



# క్రీడల పట్ల విద్యార్థులు ఆసక్తి చూపాలి

### రాష్ట్రస్థాయి ఎంపిక కోసం జిల్లాస్థాయి నెట్‌బాల్ పోటీలు -ప్రిన్సిపాల్ రాగిణి



కడప జిల్లా/సిద్ధవటం, అక్టోబర్ 28 (మహి న్యూస్): విద్యార్థులు చదువుతోపాటు క్రీడల పట్ల కూడా ఆసక్తి చూపాలని జేఎంజే కళాశాల ప్రిన్సిపాల్ రాగిణి సూచించారు. కడప--చెన్నై జాతీయ రహదారిపై ఉన్న కళాశాల క్రీడా మైదానంలో బుధవారం జిల్లాస్థాయి నెట్‌బాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రొద్దుటూరు, మాధవరం, ఒంటిమిట్ట, పాయసంపల్లి తదితర ప్రాంతాలకు చెందిన పాఠశాలల నుంచి 200 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరిచిన 40 మంది క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసేందుకు ఈ పోటీలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రాగిణి మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. క్రీడలు శారీరక దృఢత్వంతోపాటు క్రమశిక్షణ, పట్టుదల, జట్టుగా పనిచేసే నైపుణ్యాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. విద్యార్థుల్లో క్రీడల పట్ల ఆసక్తిని పెంచేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఎంపిక చేసి రాష్ట్రస్థాయి పోటీలకు పంపించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రాగిణి, జిల్లా నెట్‌బాల్ కార్యదర్శి విజయలక్ష్మి, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.



# ఎన్నికల ప్రక్రియలో ఏర్పాట్ల పరిశీలన...



ప్రొద్దుటూరు/ జమ్మలమడుగు మహి న్యూస్ అక్టోబర్ 28: జిల్లాలో మున్సిపల్ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో భాగంగా.. బుధవారం ప్రొద్దుటూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో అలాగే.. జమ్మలమడుగు ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లు, ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాలు, కౌంటింగ్ కేంద్రాలలో భద్రతా ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి.. జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ తోకలిసి పరిశీలించారు. అనంతరం జమ్మలమడుగు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఎంపిటిసి/ జెడ్పిటిసి ఎన్నికలకు సంబంధించి స్ట్రాంగ్ రూము, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటుకు అనుకులతలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని, భద్రతా చర్యలను నిరంతరం పర్యవేక్షించాలని సంబంధిత అధికారులకు సూచించారు.





# ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల షెడ్యూల్‌లో మార్పులు

### పోలింగ్ నవంబర్ 5 , రీపోలింగ్ నవంబర్ 6, ఓట్ల లెక్కింపు నవంబర్ 7న జిల్లా కలెక్టర్ డా. చెరుకూరి..

కడప మహి న్యూస్ అక్టోబర్ 28 :- పట్టణ స్థానిక సంస్థ ల ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ నవంబర్ 3వ తేదీన జరగనున్న నేపథ్యంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ తేదీని నవంబర్ 3 నుంచి నవంబర్ 5, 2026కు, రీపోలింగ్ తేదీని నవంబర్ 4 నుంచి నవంబర్ 6కు, ఓట్ల లెక్కింపు మరియు ఫలితాల ప్రకటన తేదీని నవంబర్ 5 నుంచి నవంబర్ 7, 2026కు మారుస్తూ రాష్ట్ర ఎన్నికల సంఘం ఈ రోజున సవరించిన నోటిఫికేషన్ జారీ చేసిందని జిల్లా కలెక్టర్ డా శ్రీధర్ చెరుకూరి తెలిపారు.

**సవరించిన ఎన్నికల షెడ్యూల్ :**

పోలింగ్: 05.11.2026 ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు
రీపోలింగ్ (అవసరమైతే) : 06.11.2026 ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు
ఓట్ల లెక్కింపు: 07.11.2026 ఉదయం 8 గంటల నుంచి
ఫలితాల ప్రకటన : ఓట్ల లెక్కింపు పూర్తయిన వెంటనే.

# పొగాకుకు దూరంగా యువత ఉండాలి

### కడప జిల్లాలో పొగాకు రహిత యువత ప్రచారం-4.0 ప్రారంభం




కడప, మహి న్యూస్, అక్టోబర్ 28: యువతలో పొగాకు వినియోగం వల్ల కలిగే అనారోగ్య సమస్యలపై అవగాహన కల్పించి, పొగాకు అలవాటుకు దూరంగా ఉండేలా ప్రోత్సహించేందుకు చేపట్టిన పొగాకు రహిత యువత ప్రచారం--4.0 కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. పి. యుగంధర్ బుధవారం ప్రారంభించారు. జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమం ఆధ్వర్యంలో అక్టోబర్ 28 నుంచి డిసెంబర్ 27 వరకు 60 రోజుల పాటు ఈ ప్రచారాన్ని నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా యువత, విద్యార్థులు, ప్రజలకు పొగాకు వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించనున్నారు. యువత పొగాకు అలవాటుకు బానిస కాకుండా చూడటంతో పాటు, ఇప్పటికే వినియోగిస్తున్నవారు ఆ అలవాటును మానుకునేలా ప్రోత్సహించనున్నారు. ఈ సందర్భంగా పొగాకు నియంత్రణకు సంబంధించిన అవగాహన పోస్టర్లు, ప్రచార సామగ్రిని ప్రదర్శించారు. పాఠశాలలు, కళాశాలల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, పొగాకు రహిత విద్యాసంస్థలు, గ్రామాల ఏర్పాటుకు కృషి చేయడం ఈ ప్రచారంలో భాగంగా చేపట్టనున్నారు. సిగరెట్లు, ఇతర పొగాకు ఉత్పత్తుల చట్టం--2003 అమలుపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు. గ్రామస్థాయి వరకు ప్రజల్లో అవగాహన పెంపొందించడంతో పాటు, వివిధ శాఖల సమన్వయంతో ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నారు. చేపట్టిన కార్యక్రమాల వివరాలను నమోదు చేసి, వాటి పురోగతిని నిరంతరం పర్యవేక్షించనున్నారు. పొగాకుకు దూరంగా ఉండాలి.. ఆరోగ్యకరమైన యువతతో ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించాలి అని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ అధికారి డా. ఆరిఫుల్లా, ఆర్థిక సలహాదారు స్వర్ణలత, జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమం సిబ్బంది, మనోవైజ్ఞానిక నిపుణులు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.

# ట్రాన్స్‌జెండర్ల హక్కులు, ఉచిత న్యాయ సేవలపై అవగాహన

### శివానందపురం, వికలాంగుల కాలనీ, మరియాపురంలో న్యాయ విజ్ఞాన సదస్సులు




కడప, అక్టోబర్ 28 (మహి న్యూస్): ట్రాన్స్‌జెండర్లు తమ హక్కులపై అవగాహన పెంపొందించుకొని, గౌరవప్రదమైన జీవనం సాగించేందుకు న్యాయ సేవాధికార సంస్థ అందించే సేవలను వినియోగించుకోవాలని న్యాయాధికారులు సూచించారు. కడప నగరంలోని శివానందపురం, వికలాంగుల కాలనీ, మరియాపురం ప్రాంతాల్లో ట్రాన్స్‌జెండర్లకు వారి హక్కులు, మధ్యవర్తిత్వం, ఉచిత న్యాయ సేవలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, అమరావతి ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. రామగోపాల్, సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ సూచనలతో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎన్. హరిబాబు ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సులు జరిగాయి. ఈ సందర్భంగా ట్రాన్స్‌జెండర్లకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, సమానత్వపు హక్కు, వివక్షకు వ్యతిరేకంగా ఉన్న చట్టపరమైన రక్షణలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఉచిత న్యాయ సహాయం పొందే విధానాలపై వివరించారు.

### వివాదాల పరిష్కారంలో మధ్యవర్తిత్వం కీలకం

వివాదాలను పరస్పర చర్చల ద్వారా సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవడంలో మధ్యవర్తిత్వం కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. అర్హులైన వారు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని తెలిపారు. ట్రాన్స్‌జెండర్లు తమకు రాజ్యాంగం కల్పించిన హక్కులను తెలుసుకొని, ఎలాంటి వివక్షకు గురైనా చట్టపరమైన సహాయం పొందాలని సూచించారు. న్యాయపరమైన సమస్యలు ఎదురైనప్పుడు సంబంధిత న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని పేర్కొన్నారు.

### ఉచిత న్యాయ సహాయం కోసం 15100

న్యాయ సహాయం అవసరమైన వారు లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నంబర్ 15100కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చని తెలిపారు. కడప జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించి తమ సమస్యలకు తగిన న్యాయ సహాయం పొందవచ్చని సూచించారు. ఈ కార్యక్రమాల్లో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్స్ నీలకంఠేశ్వరరెడ్డి, అక్బర్ అలీ, పారా లీగల్ వాలంటీర్లు దశరథ, రామిరెడ్డి, కృష్ణారెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.

# దిగువపట్నం కాలనీలో కూటమి ఎన్నికల ప్రచార సభ

### 16, 17, 18, 19 వార్డుల్లో ప్రజలను కలిసిన టీడీపీ, జనసేన నాయకులు



కడప జిల్లా/జమ్మలమడుగు, అక్టోబర్ 28 (మహి న్యూస్): జమ్మలమడుగు మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా దిగువపట్నం కాలనీలోని 16, 17, 18, 19 వార్డుల్లో నిర్వహించిన సభలో కడప జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు భూపేష్ సుబ్బరామిరెడ్డి, జమ్మలమడుగు మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి చదిపిరాళ్ల జ్యోతి పాల్గొన్నారు. వారితో పాటు జమ్మలమడుగు జడ్పీటీసీ సభ్యుడు రాజేష్ రెడ్డి ప్రచార కార్యక్రమంలో పాల్గొని కూటమి అభ్యర్థులకు మద్దతుగా ప్రజలను కలిశారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు మున్సిపల్ ఎన్నికల్లో తమ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరారు. వార్డుల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు రమణారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి సంతోష్, జనసేన నాయకుడు నాగార్జున, వార్డు సభ్యులు వైష్ణవి, సుధారాణి, సుగుణమ్మ, శివకుమార్‌తో పాటు ఎన్‌డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆరోగ్య సేవల్లో వైఎస్సార్ కడప జిల్లాకు రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం

### సెప్టెంబర్ నెల ర్యాంకింగ్స్‌లో 78.90 మార్కులతో అగ్రస్థానం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డా. పి. యుగంధర్ అభినందనలు

కడప, అక్టోబర్ 28 (మహి న్యూస్): రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఆరోగ్య సేవలు అందించడంలో వైఎస్సార్ కడప జిల్లా ప్రథమ స్థానాన్ని సాధించింది. ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ విడుదల చేసిన 2026 సెప్టెంబర్ నెల జిల్లా పనితీరు ర్యాంకింగ్స్‌లో జిల్లా అగ్రస్థానంలో నిలిచింది. మొత్తం 100 మార్కులకు గాను 78.90 మార్కులు సాధించి, 80.92 శాతం పనితీరు సూచికతో మొదటి ర్యాంకును కైవసం చేసుకుంది.

### వివిధ ఆరోగ్య కార్యక్రమాల అమలులో పురోగతి

మాతా శిశు ఆరోగ్యం, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ, వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాలు, కుటుంబ నియంత్రణ, సమగ్ర ప్రాథమిక ఆరోగ్య సేవలు, అసంక్రమిత వ్యాధుల నియంత్రణ, ఆర్‌బీఎస్‌కే, పట్టణ ఆరోగ్య సేవలు, వైద్య సేవల నాణ్యత ప్రమాణాలు, అభా ఎఫ్ఆర్ఎస్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరు, వ్యాధుల నియంత్రణ వంటి వివిధ అంశాల్లో జిల్లా సాధించిన పురోగతి ఈ విజయానికి దోహదపడింది.




### వైద్య సిబ్బందికి డీఎంహెచ్‌ఓ అభినందనలు

జిల్లా రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం సాధించడం సంతోషకరమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డా. పి. యుగంధర్ తెలిపారు. ఈ విజయానికి కృషి చేసిన క్షేత్రస్థాయి వైద్య సిబ్బంది, వైద్యాధికారులు, కార్యక్రమాల పర్యవేక్షణ అధికారులు, ఇతర సిబ్బందిని ఆయన అభినందించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ప్రతి ఒక్కరూ ఇదే స్ఫూర్తితో పనిచేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో వైద్య సేవలు అందించడంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని, ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేస్తూ, భవిష్యత్తులోనూ ఇదే పనితీరును కొనసాగించాలని పిలుపునిచ్చారు. ప్రజారోగ్య పరిరక్షణలో వైఎస్సార్ కడప జిల్లాను ముందంజలో నిలిపేందుకు వైద్య సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు.

# ఖైదీల హక్కుల పరిరక్షణకు ఉచిత న్యాయ సహాయం

### రాయచోటి సబ్‌జైలు, న్యాయ సహాయ కేంద్రాలను సందర్శించిన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి

రాయచోటి, అక్టోబర్ 28 (మహి న్యూస్): ఖైదీలు తమ హక్కులపై అవగాహన పెంపొందించుకొని, ఉచిత న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ సూచించారు. బుధవారం ఆయన రాయచోటి సబ్‌జైలును, అక్కడి న్యాయ సహాయ కేంద్రాన్ని సందర్శించి రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, అమరావతి ఆదేశాల మేరకు, కడప జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. రామగోపాల్ సూచనలతో ఈ పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్. బాబా ఫక్రుద్దీన్ మాట్లాడుతూ జైళ్లలో న్యాయ సహాయ కేంద్రాల ప్రాధాన్యతను వివరించారు. ఖైదీలకు అందుతున్న న్యాయ సేవలు, వారి హక్కులు, ఉచిత న్యాయ సహాయం, న్యాయ సహాయ రక్షణ న్యాయవాదుల వ్యవస్థ పనితీరును సమీక్షించారు.

### ఖైదీల సమస్యలపై ఆరా

సబ్‌జైలులోని ఖైదీలతో మాట్లాడి వారి కేసుల వివరాలు, ఆరోగ్య పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. న్యాయపరమైన సమస్యలు ఎదురైనప్పుడు అందుబాటులో ఉన్న ఉచిత న్యాయ సహాయ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఖైదీలకు అవసరమైన సలహాలు, సూచనలు అందించారు. అలాగే, న్యాయ సేవలకు సంబంధించిన సమాచారం కోసం 15100 టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్‌ను వినియోగించుకోవాలని తెలిపారు. ఏవైనా న్యాయపరమైన సమస్యలు ఉంటే రాయచోటి మండల న్యాయ సేవా సమితిని లేదా కడప జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మధ్యవర్తిత్వ న్యాయవాది ఎం. వేణుగోపాల్, న్యాయ సహాయ రక్షణ న్యాయవాదులు, రాయచోటి సబ్‌జైలు సూపరింటెండెంట్, ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు, ఖైదీలు పాల్గొన్నారు.




EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED AT #1/704, PARK STREET, NEAR OLD BUSTAND, JAMMALAMADUGU-516434,YSR KADAPA DIST, A.P
PRINTED AT VSAR PRINTERS, YSR KADAPA DIST, 516004. RNI NO : APTEL/25/A0108. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com